ప్రజాశక్తి

సోమవారం 30 అక్టోబర్ 2023   8 పేజీలు

గుంటూరు

పల్నాడు

ఉల్లి కిలో రూ.70

- కందిపప్పు : రూ.170
- మినపగుళ్లు రూ.130
- దిగిరాని బియ్యం ధరలు
- పెరుగుదల దిశగా టమాట

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

ఉల్లి పాయల ధరలు భారీగా పెరిగి కిలో రూ.70కు చేరింది. రైతు బజార్లలో రూ.60 ఉండగా మార్కెట్‌లో మాత్రం రూ.70పైన విక్రయిస్తున్నారు. రెండు నెలల క్రితం వరకు టామాట ధర కిలో రూ.20 నుంచి రూ.180 వరకు పెరిగినట్టు ప్రస్తుతం ఉల్లిపాయలు ధరలు గత 15 రోజులుగా పెరుగుతున్నాయి. కిలో రూ.20 నుంచి రూ.70కు చేరాయి. ఈ ధర ఇంకా పెరుగుతుందని చెబుతున్నారు. ఇతర రాష్ట్రాల్లో ఆశించినంత దిగుబడి రాకపోవడం, రాష్ట్రంలో విస్తీర్ణం తగ్గడం వల్ల కొరత ఏర్పడిందని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న సరుకు కూడా నాణ్యతగా లేదు. కిలో ఉల్లిపాయలు కొంటే అందులో అరకిలోకు పైగా నల్లటి బూజుపట్టిన పాయలు ఉంటున్నాయి. గతేడాది నుంచి నిల్వ ఉన్న పాయలు బూజుపట్టినట్టుగా వ్యాపారులు తెలిపారు. రైతు బజార్లలలో ఎక్కువగా బూజుపట్టినవి వస్తున్నాయి. వీటిని ఏరుకోవాడానికి వినియోగదారులు ప్రయత్నిస్తుండగా కొంత మంది వ్యాపారులు ఏరడం కుదరదని చెబుతున్నారు.

టమోటా ధర మళ్లీ పెరుగుతోంది. ప్రస్తుతం రైతు బజార్లలో 28 నుంచి రూ.30 వరకు ఉండగా బహిరంగ మార్కెట్‌లో రూ.40 పలుకుతోంది. నెల రోజులుగా వర్షాభావం వల్ల టమాట ఉత్పత్తి కూడా క్రమంగా తగ్గుతోంది. పంటలు ఎదుగుదల దశలో ఉన్న కూరగాయాల తోటలకు వర్షాభావం వెంటాడుతోంది. దీంతో రానున్న కాలంలో ఉత్పత్తులు తగ్గి మళ్లీ ధరలు పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు తెలిపారు. రైతు బజార్లలో ప్రభుత్వం ప్రస్తుతం బెండకాయలు, దొండకాయలు, క్యాబేజి, పొట్లకాయలు ధరలు తగ్గాయి. పచ్చిమిర్చి ధర రూ.50 వరకు పలికింది.

మరోవైపు బియ్యం, జిల్లాలో పప్పు దినుసులు ధరల పెరుగుదల కొనసాగుతోంది. సాదారణ బియ్యం ధరలు కిలో రూ.50 తగ్గడం లేదు. ఆరు నెలల నెలల క్రితం రూ.40 పలికిన బియ్యం క్రమంగా రూ.60 వరకు పెరిగింది. కందిపప్పు కిలో రూ.170 నుంచి రూ.180కు చేరింది. ఆరు నెలల క్రితం రూ.100 అమ్మిన కందిపప్పు ఏకంగా రూ.180 వరకు పెరిగింది. మినపగుళ్ల రూ.100 నుంచి రూ.130కి పెరిగాయి. వేరుశనగ గుళ్ల రూ.130 నుంచిరూ.150 పలుకుతుండగా పచ్చి పప్పు మాత్రం రూ.80కి చేరింది. పుట్నాల పప్పు రూ.90 నుంచి రూ.110కు పెరిగింది. కందిపప్పు విదేశాల నుంచి ఎక్కువగా దిగుమతి అవుతున్నట్టు వ్యాపారులు తెలిపారు. దేశీయంగా కందిపప్పు నిల్వలు లేకపోవడం వల్ల బర్మా, సౌత్ ఆఫ్రికా దేశాలనుంచి దిగుమతి చేసుకుంటున్నారని వ్యాపారులు తెలిపారు. ప్రభుత్వం రేషన్ కార్డులపై కందిపప్పు సరిగా సరఫరా చేయకపోవడంతో ధరలు అందుబాటులోకి రావడంలేదు. ఇతర నిత్యావసర వస్తువులు కూడా క్రమంగా పెరుగుతున్నాయి. గోధుమ పిండి, గోధుమ, బొంబాయి రవ్వల ధరలూ పెరిగాయి.

సమావేశంలో మాట్లాడుతున్న గుంటూరు విజయ్‌కుమార్

7న పల్నాడుకు సిపిఎం బస్సు యాత్ర

- ద్రోహం చేసిన బిజెపికి వంతపాడుతున్న ఆ మూడు పార్టీలు
- సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్

ప్రజాశక్తి-క్రోసూరు

రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపికి అనుకూలంగా వైసిపి, టిడిపి, జనసేన వ్యవహరించడం దుర్మార్గమని, ఈ పార్టీలను ప్రజలు నిలదీయాలని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్ అన్నారు. సిపిఎం పెదకూరపాడు నియోజకవర్గ విస్తృత సమావేశం మండల కేంద్రమైన క్రోసూరు ఆమంచి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. సమావేశానికి సిపిఎం అమరావతి మండల కార్యదర్శి బి.సూరిబాబు అధ్యక్షత వహించారు. విజయకుమార్ మాట్లాడుతూ అవకాశవాద పార్టీలకు ప్రత్యామ్నాయంగా రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం సిపిఎం ప్రజా ప్రణాళికను రూపొందించిందని, దీనిపై రాష్ట్రవ్యాప్తంగా మూడు చోట్ల నుండి బస్సు యాత్రలు నిర్వహిస్తోందని తెలిపారు. ఒక యాత్ర 7వ తేదీన పల్నాడు జిల్లాకు వస్తుందని, సత్తెనపల్లిలో బహిరంగ సభ ఉంటుందని చెప్పారు. దీంతోపాటు 15న విజయవాడలో జరిగి ప్రజారక్షణ భేరి బహిరంగ సభకు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విభజన హామీలు, రాజధాని, పోలవరం, కడప స్టీల్‌ప్లాంట్ల నిర్మాణాలను విస్మరించడంతోపాటు విశాఖ ఉక్కును అమ్మాలని చూడ్డం తెలుగు జాతిని మోసం చేయడమేనన్నారు. ఉద్యోగాలను భర్తీ చేయడం లేదని, నోట్ల రద్దు ద్వారా కోట్లాది మంది ఉపాధిని దెబ్బతీసిందని, మరోవైపు ప్రజల మధ్య కుల, మత ద్వేషాలు రెచ్చగొడుతోందని మండిపడ్డారు. బిజెపితోపాటు ఆ పార్టీకి వంతపాడే పార్టీలకూ ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రవిబాబు మాట్లాడుతూ పెదకూరపాడు, క్రోసూరు మండలాల్లో సాగర్ అయకట్టు చివరి భూముల్లో వేలాది ఎకరాల్లో మిర్చి పైరుకు నీరందక ఎండిపోతోందని చెప్పారు. పొలాలకు సాగర్ నీరివ్వాలని, లేకుంటే పంట

▶ 2లో

సమావేశంలో మాట్లాడుతున్న సిడబ్ల్యూసి సభ్యుడు ఎన్.రఘువీరారెడ్డి

ఒబిసి జనగణనకు కట్టుబడి ఉన్నాం

సిడబ్ల్యూసి సభ్యుడు ఎన్.రఘువీరారెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

దేశంలో ఒబిసి జనగణనకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ సభ్యుడు ఎన్.రఘువీరారెడ్డి చెప్పారు. ఓబీసీ జనగణ కార్యచరణపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఒబిసి రాష్ట్ర ముఖ్య నాయకులతో గుంటూరులోని ఏటూకూరు రోడ్డులోని వివాహ కన్వెన్షన్ హాలులో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ వ్యాప్తంగా కుల ప్రాతిపదికన జన గణన చేయాలనే ఆయా సంఘాల డిమాండ్‌ను కాంగ్రెస్ నాయకత్వం ఆమోదించిందన్నారు. ప్రతి మూడేళ్లకోసారి జరిగే కాంగ్రెస్ పార్టీ ప్లీనరీ సమావేశంలో సామాజిక ఆర్థిక న్యాయాలపై చర్చ జరుగుతుందని, గతంలో జరిగిన సమావేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల లెక్కలు తేలాలని తీర్మానించామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ దేశంలో త్వరలోనే అధికారంలోకి రాబోతుందని, కచ్చితంగా బీసీ కులాల గణన చేసి దేశ రాజకీయాల్లో ప్రత్యేక చోటు కల్పిస్తామని అన్నారు. దేశాభివద్ధి కోసం కాంగ్రెస్ పోరాటం చేస్తూ దేశాన్ని నిర్మిస్తుంటే బిజెపి మాత్రం దేశాన్ని మత ప్రాతిపదికన ద్వేషాలు పెంచుతోందన్నారు. ప్రశ్నించిన వారిపై సిబిఐ, ఈడిలతో భయపెట్టే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ బిసి సెల్ జాతీయ అధ్యక్షులు అజయ్ సింగ్ మాట్లాడుతూ కాంగ్రెస్

▶ 2లో

కేంద్ర ప్రభుత్వ విధానాలపై 27, 28 తేదీల్లో మహాధర్నా

ప్రజాశక్తి-గుంటూరు

మాట్లాడుతున్న నేతాజి

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా రాష్ట్ర రాజధానులలో కేంద్ర కార్మిక కర్షక సంఘాలు పిలుపులో భాగంగా 27, 28 తేదీల్లో విజయవాడలో జరిగే మహాపడావో (మహాధర్నా)ను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక పాత గుంటూరులోని సిఐటియు జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు డి.లక్ష్మీనారాయణ అధ్యక్షతన సిఐటియు జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. నేతాజి మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక, కర్షక వర్గంపై ముప్పేట దాడి చేస్తోందని విమర్శించారు. కార్మిక చట్టాలను రద్దుచేసి,

▶ 2లో

సేంద్రీయ సేద్యమే శ్రేయోదాయం

- రైతులకు ఖర్చు తగ్గించడమే ధ్యేయం
- నాణ్యమైన ఉత్పత్తుల సాధనే లక్ష్యం
- పల్నాడు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమలకుమారి

3 లో

పిడుగురాళ్లలో నిరసన

8 లో

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన దుండగుల్ని శిక్షించాలి

ఒబిసి జనగణనకు కట్టుబడి ఉన్నాం

(మొదటి పేజీ తరువాయి)

పాలిత రాష్ట్రాల్లో ఒబిసి జనగణన అమలుకు చర్యలు ప్రారంభమయ్యాయని, మిగతా రాష్ట్రాల్లోనూ చేసేలా ఒత్తిడి తెస్తామని అన్నారు. అనంతరం కేంద్ర మాజీమంత్రి జెడి శీలం, పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలి, జిల్లా అధ్యక్షులు ఎల్.ఈశ్వరరావు మాట్లాడారు. బిసి జనగణనకు కాంగ్రెస్ అంగీకరించడంపై బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు ఆధ్వర్యంలో పలు బిసి సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. రఘువీరారెడ్డి, అజయ్‌సింగ్‌ను సన్మానించారు.

7న పల్నాడుకు సిపిఎం బస్సు యాత్ర

(మొదటి పేజీ తరువాయి)

నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్షాభావంతో పత్తి దిగుబడి తగ్గుతుందని, ఈ క్రమంలో క్వింటాళ్ రూ.8 వేల మద్దతు ధరకు కొనాలని కోరారు. నియోజకవర్గంలోని సాగు భూములకు శాశ్వతంగా నీటి సదుపాయం కోసం పులిచింతల రిజర్వాయర్‌లోని బ్యాక్ వాటర్‌ను లిఫ్ట్ ద్వారా బెల్లంకొండ బ్రాంచ్ కెనాల్‌కు సరఫరా అయ్యేలా నిర్మాణం చేపట్టాలన్నారు. ఇసుక సామాన్య ప్రజలకు భారమైందని, జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని కోరారు. సమావేశంలో సిపిఎం క్రోసూరు, అచ్చంపేట, పెదకూరపాడు మండల కార్యదర్శులు టి.హనుమంతరావు, ఆర్.వెంకటేశ్వర్లు, డి.శేషారావు, నాయకులు ఎ.ఆంజనేయులు, టి.కుమారి, జి.ఎలిశమ్మ, ఎన్.చిన్నమ్మాయి, ఎం.పౌలు, దుర్గారావు, సిహెచ్.యేసయ్య, ఎ.వెంకటేశ్వర్లు, జి.మహేష్, షేక్ ముస్తఫా, ఎస్.మోహనరావు, టి.చుక్కయ్య, ఎస్.సాంబయ్య, షేక్ మోహిదీన్, కె.యెషయ్య పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలపై 27, 28 తేదీల్లో మహాధర్నా

(మొదటి పేజీ తరువాయి)

నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకురావడం, పని గంటల పెంపు, కార్పొరేట్ వర్గానికి పెద్ద ఎత్తున రాయితీలు వంటి వాటిని అమలు చేస్తూ ప్రభుత్వ రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తోందని చెప్పారు. ఈ విధానాలను ప్రతి ఒక్కరు వ్యతిరేకించాలన్నారు. ఈ కాలంలో ఏ ఒక్క పరిశ్రమను స్థాపించకపోగా ఉన్న పరిశ్రమలు మొత్తం అదాని, అంబానీలకు కట్టబెడుతోందన్నారు. రైతు వ్యతిరేక నల్లచట్టాలు తెచ్చి రైతులపై దాడి చేసిందన్నారు. రైతుల పోరాడి ఆ చట్టాలను తిప్పికొట్టారన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు పెద్ద ఎత్తున పెంచి భారాల మోపుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా విజయవాడలో జరిగే మహాధర్నాలో కార్మికులు, కర్షకులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.శ్రీనివాసరావు, వి.దుర్గారావు, టి.వి.జి.రవిశంకర్, ఎస్.కె.హుస్సేన్‌వలి, జిల్లా కార్యదర్శి ఎన్.శివాజీ, బి.ముత్యాలరావు, బి.లక్ష్మణరావు, ఎన్.రమేష్ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో లోపాలను సరిదిద్దండి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఈనెల 27వ తేదీన ప్రకటించిన ముసాయిదా ఓటర్ల జాబితాను అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు పరిశీలించి ఓట్ల అక్రమాలను నివారించి స్వచ్ఛమైన ఓటర్ల రూపకల్పనకు కృషి చేయాలని జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఓటర్ల జాబితా స్వచ్ఛందంగా ఉంటే ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా జరిగి ఓటింగ్ శాతం గణనీయంగా పెరుగుతుందన్నారు. ఎన్నికల విధులలో వాలంటీర్లను, సచివాలయ సిబ్బందిని వినియోగించుకోకుండా అనుభవం ఉన్న ఉపాధ్యాయులను, అధ్యాపకులను, గెజిటెడ్ ఆఫీసర్లను వినియోగించుకోవాలని జనచైతన్య వేదిక రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తుందన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జిల్లాలో అభివృద్ధి పనులు మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డిని ప్రభుత్వ విప్ లేళ్ళ అప్పిరెడ్డి కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ లబ్ధి చేకూరేలా తగు చర్యలు చేపట్టాలన్నారు. శాసనమండలిలో ప్రభుత్వ విప్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డిని ఆదివారం కలెక్టర్ బంగ్లాలో అప్పిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జరిగిన భేటీలో జిల్లాలో జరుగుతున్న అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు తీరుపై చర్చించారు. అప్పిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్ ఆలోచనలు, ఆశయాల మేరకు జిల్లా అంతటా విస్తృతంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు జరుగుతున్నాయన్నారు. వాటిని సకాలంలో పూర్తి చేసినప్పుడే ప్రజలకు ప్రగతి ఫలాలు సవ్యంగా అందుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో దీనిపై ప్రత్యేకంగా దృష్టి సారించి సంబంధిత అధికారులకు తగు ఆదేశాలని జారీ చేయాలని కోరారు.

స్విమ్మింగ్ పూల్‌కు సందర్శకుల తాకిడి

ప్రజాశక్తి - మంగళగిరి

శారీరక వ్యాయామాలకు నేడు ప్రాధాన్యత పెరిగి పోతోంది. ఆరోగ్యాన్ని కాపాడుకునే విషయంలో ప్రతి ఒక్కరూ ఆశక్తి చూపుతున్నారు. ప్రజల సౌకర్యార్థం స్విమ్మింగ్ చేసుకునేందుకు ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా నగరంలోని తెనాలి రోడ్డు లో మెహబూబ్ షంషేర్ ఖాన్ పేరిట స్విమ్మింగ్ పూల్ ను ఇటీవల ఎమ్మెల్యే ఆళ్ల రామకష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ నేపథ్యంలో శెలవు రోజు కావడంతో ఆదివారం స్విమ్మింగ్ పూల్‌కు సందర్శకుల తాకిడి పెరిగింది చిన్నారులు, యువత పెద్ద సంఖ్యలో వచ్చి స్విమ్ చేసి సరదాగా ఉల్లాసంగా గడిపారు. ప్రతి రోజు వందమంది స్విమ్మింగ్ పూల్ కు వస్తున్నారని కోచ్ నాంచారమ్మ తెలిపారు. మరి కొద్ది రోజుల్లో స్విమ్మింగ్ పూల్ సేవలను వినియోగించుకోవాలంటే కనీస రుసుమును చెల్లించాలని అధికారులు నిబంధన పెట్టమన్నారు.

నిర్వహణలో జాగ్రత్తలు తీసుకుంటే మేలు

స్విమ్మింగ్ పూల్ నిర్వహణ విషయంలో పలు జాగ్రత్తలు తీసుకుంటే మేలని పలువురు సూచిస్తున్నారు. డిస్ ఇన్ఫెక్షన్ బాతింగ్ అయిన తరువాత మాత్రమే స్విమ్మింగ్ పూల్ లోకి అనుమతించాలి. లేదంటే వైరల్ ఇన్ఫెక్షన్ లు సోకి అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని చెబుతున్నారు. స్విమ్మింగ్ పూల్ లోకి ప్రవేశించే ప్రతి ఒక్కరికి నిర్దేశిత సమయాన్ని కేటాయించాలి. ఆ సమయం ముగిసిన అనంతరం ఇతరులకు అవకాశం కల్పించాలి. నీటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ ఉండాలి. ఇటువంటి జాగ్రత్తలతో స్విమ్మింగ్ పూల్ ను నిర్వహిస్తే మరింత ప్రయోజనమని పలువురు చెబుతున్నారు.

ఎండిపోతున్న పొలాల పరిశీలన

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి మండలం పెదవడ్లపూడిలో నీరు అందక ఎండిన పంట పొలాలను సిపిఐ బృందం ఆదివారం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.నాగేశ్వరరావు మాట్లాడుతూ కృష్ణా డెల్టా ఆయకట్టు ప్రాంతం నీటి కొరతతో ఇబ్బంది పడుతుందని, ఇది రాష్ట్ర ప్రభుత్వం తప్పిదమని విమర్శించారు. సాగర్‌కు పూర్తిస్థాయిలో శ్రీశైలం తొనికేసలాడుతూ నీటి నిల్వలు గత సంవత్సరం కాలంలో ఉన్నప్పుడు ఆ నీటిని నిల్వ ఎలా చేసుకోవాలి వర్షాభావ పరిస్థితి వస్తే పంటలను ఎలా కాపాడుకోవాలి సాగునీటిని ఎలా రిజర్వ్ చేసుకోవాలి అనే జ్ఞానం సిఎం, ఇరిగేషన్ మంత్రికి లేవన్నారు. రైతులకు సమాధానం చెప్పలేక ఇళ్లల్లో తలుపులేసుకుని పడుకునే పరిస్థితి వచ్చిందన్నారు. ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి నాటకాలు కట్టిపెట్టి ఇంజన్లు పెట్టిచ్చి పంటను కాపాడటానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. రేవేంద్రపాడు దగ్గర ఉన్న కూలిపోయే వంతెన అది ఎవరో ఒకరు లారీలో బస్సు కూలిపోయి మనుషులు చనిపోతే తప్ప ఆ వంతెన రిపేర్ చేయలేరా అని ప్రశ్నించారు. వంతెన కట్టి ఆధునిక వంతెన ఆ లాకులు దించితే హై లెవెల్ ఛానల్ కు నీళ్లు వచ్చేటట్లు ఒక శాశ్వత పరిష్కారాన్ని చూపాలని సూచించారు.

కళ్లకు గంతలతో టిడిపి నిరసన

గుంటూరులో

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

చంద్రబాబు అరెస్ట్‌ను నిరసిస్తూ 'గుడ్డి ప్రభుత్వం కళ్ళు తెరిపిద్దాం' కార్యక్రమంలో భాగంగా గుంటూరులోని వేర్వేరు ప్రాంతాల్లో టిడిపి నాయకులు కళ్లకు నల్లరిబ్బన్లు కట్టుకుని ఆదివారం రాత్రి నిరసన తెలిపారు. సాయిబాబా రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఇంచార్జి కోవెలమూడి రవీంద్ర ఆధ్వర్యంలో కళ్లకు గంతలు కట్టుకొని 'నిజం గెలవాలి' అని నినాదాలు చేశారు. ఆధారాలు, సాక్ష్యాలు బయట పెట్టలేక చివరకు పార్టీకి వచ్చిన నిధులను కూడా అవినీతి సొమ్ముగా చూపే ప్రయత్నం చేస్తున్నారని కోవెలమూడి రవీంద్ర విమర్శించారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గం పార్టీ కార్యాలయంలో తెలుగు మహిళలతో కలిసి కళ్ళకు గంతలు కట్టుకొని తూర్పు నియోజకవర్గం ఇన్‌ఛార్జి మొహమ్మద్ నసీర్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్పొరేటర్ సమత గారు తెలుగు మహిళలు వజ్జా లక్ష్మి, గుడిపల్లి వాణి, చిదర్ల మల్లికా, సావిత్రి, రెహమునిస, చెట్టెం సింధు, చిన్ని, మువ్వా శైలజ, సుఫియా పాల్గొన్నారు

ప్రజాశక్తి - మంగళగిరి

పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద టిడిపి శ్రేణులు 'కళ్లు తెరిపిద్దాం' నిరసన తెలిపారు. నాయకులు మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ అక్రమ కేసులో చంద్రబాబు పాత్ర ఎక్కడ లేకపోయినా అరెస్టు చేశారన్నారు. అక్రమంగా అరెస్టు చేసి ఇన్ని రోజులవుతున్నా ప్రభుత్వం ఇప్పటి వరకు ఒక్క ఆధారాన్ని కూడా కోర్టుకు సమర్పించలేకపోయిందని విమర్శించారు. చంద్రబాబును మానసిక క్షోభకు గురిచేసే ప్రయత్నం తప్ప వేరొకటి కాదన్నారు. ఉద్దేశపూర్వకంగానే వాయిదాలు అడుగుతూ చంద్రబాబు రిమాండు కొనసాగిస్తున్నారు.

ప్రజాశక్తి - పెదనందిపాడు

చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ 'నిజం గెలవాలి' కార్యక్రమాన్ని స్థానిక పాతబస్టాండ్ సెంటర్‌లో ఆదివారం నిర్వహించారు. టిడిపి గ్రామ అధ్యక్షులు ఆర్. శివరామకృష్ణయ్య మాట్లాడుతూ నియంతల పాలనలో అభివృద్ధి కుంటుపడిందని, కక్షపూరిత రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. తప్పేమీ చేయని చంద్రబాబును ఇన్ని రోజులు పాటు రిమాండ్‌లో ఉంచటం అన్యాయమన్నారు. ఆలస్యమైన న్యాయం గెలుస్తుందని చంద్రబాబు త్వరలోనే బయటకు వస్తారని చెప్పారు. ఎం.చెంచయ్య, డి.నాగరాజు, డి.ప్రమీల, కె.శివయ్య, ఎల్.సుబ్బారావు, కె.హరిబాబు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తుళ్లూరు

న్యాయం గెలవాలంటూ చంద్రబాబుకు మద్దతుగా ఆదివారం రాత్రి తుళ్లూరు, ఉద్దండరాయునిపాలెం తదితర గ్రామాల్లో కళ్లకు గంతలతో నిరసన తెలిపారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు, రైతులు, మహిళలు పాల్గొన్నారు. అమరావతి దళిత జెఎసి, టిడిపి నాయకులు పులి చిన్నా మాట్లాడారు.

ప్రజాశక్తి - తాడేపల్లి

ఉండవల్లిలో కళ్లకు గంతలతో టిడిపి శ్రేణులు నిరసన తెలపగా ఆ పార్టీ మండల అధ్యక్షులు ఎ.సుబ్బారావు మాట్లాడారు. డి.జ్యోతిబసు, జి.బసివిరెడ్డి, ఎస్.బుజ్జి, కె.రమేష్ పాల్గొన్నారు.

ఉద్దండ్రాయునిపాలెంలో

సేంద్రీయ సేద్యమే శ్రేయోదాయం

- రైతులకు ఖర్చు తగ్గించడమే ధ్యేయం
- నాణ్యమైన ఉత్పత్తుల సాధనే లక్ష్యం
- జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమల కుమారి

రసాయనిక ఎరువుల స్థానంలో సేంద్రీయ ఎరువులను వినియోగించడం వల్ల ఖర్చు తగ్గడంతో పాటు నాణ్యమైన దిగుబడులు వస్తాయని సేంద్రీయ వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమలకుమారి తెలిపారు. 2016 లో పైలెట్ ప్రాజెక్టుగా సత్తెనపల్లి నియోజకవర్గం బెల్లంకొండలో ప్రారంభించిన ప్రకృతి వ్యవసాయం 2017 నుండి విజయవంతంగా లక్ష్యం మేరకు సేంద్రీయ ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఉత్పత్తి దారుల నుండి దళారి వ్యవస్థ లేకుండా నేరుగా వినియోగదారులకు అందజేసేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె పలు అంశాలు తెలియజేశారు.

సేంద్రీయ ఉత్పత్తులు ఎలా అందిస్తారు?

రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న సేంద్రీయ ఉత్పత్తులతో సాగు విధానం కేవలం రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. రైతులు తమ ఇళ్లల్లోని వ్యర్థపదార్థాలతో పాటు పాడి పశుపోషకుల నుంచి వచ్చే వ్యర్థాలను కూడా కలిపి సేంద్రీయ ఎరువుగా మార్చి అందిస్తాం. తద్వారా పోషకాలు కలిగిన ఉత్పత్తులు పొందవచ్చు. ఈ ఎరువులతో 20 సెంట్ల భూమిలో ఒక కుటుంబానికి సరిపడా 18 రకాల కూరగాయలు ఆకు కూరలు పండించుకోవచ్చని సూచించారు.

సేంద్రీయ ఎరువుల వినియోగం వల్ల ఉపయోగాలు, భూసారం భూమిలో సూక్ష్మ పోషకాల పెంపుదల ఆరోగ్యకరమైన పంటల సాధనే ముఖ్య ఉద్దేశ్యం. మొక్కలకు ఎటువంటి రసాయన ఎరువులు పురుగు మందులు వినియోగించకుండా కేవలం పశువుల పేడ, ఇతర వ్యర్థ పదార్థాల ద్వారా తయారు చేసే ఉత్పత్తులతో సేంద్రీయ ఎరువులను తయారు చేయవచ్చు.

ఈ విధానంలో సాగు లాభదాయకంగానే ఉందా?

రసాయనిక ఎరువులు పురుగు మందులు వినియోగం ద్వారా సాధించినంత దిగుబడులు సాధించలేకపోయినప్పటికీ సేంద్రీయ విధానం లాభసాటిగానే ఉందని రైతులు చెబుతున్నారు. మిద్దెలపై ప్లాస్టిక్ ట్రేలలో , కుండీలలో తీగ జాతి పంటలైన బీర,దోస,కాకర,సొర, పొట్లతో పాటు అన్ని రకాయల ఆకుకూరలు మొక్క జాతి కూరగాయలు సాగు చేసుకోవచ్చన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న హైబ్రిడ్ కూరగాయల రకాలను పండించడం ద్వారా తక్కువ రోజులలో అధిక దిగుబడులు సాధించవచ్చు.

దిగుబడులు తగ్గినా లాభదాయకం ఎలా?

రసాయనిక ఎరువులు,పురుగు మందుల వల్ల ఖర్చులు పెరుగుతున్నాయి. సేంద్రీయ ఎరువుల వల్ల ఖర్చు తక్కువ. గతంలో ఈ విధానం ఎంతో కాలం అమలు చేశారు. తగిన దిగుబడులు, నాణ్యమైన, బలవర్ధకమైన ఉత్పత్తులు వస్తాయి.

ఈ విధానంలో రైతులకు ఏమైనా రాయితీలు ఉన్నాయా?

ఈ విధానంలో రైతులకు ఎటువంటి రాయితీలు లేవు. ఇటీవల ఎస్.సి కార్పొరేషన్ ద్వారా ఒక్కో రైతుకు రూ 10 వేలు విలువైన 1952 మంది ఎస్.సి రైతులకు రూ 1.95 కోట్ల విలువైన విత్తనాలు కషాయాల తయారీకి సంబంధించిన కిట్లను పంపిణీ చేస్తున్నాము. ఎస్.సి రైతులకు ఇప్పటికి 50 శాతం మందికి పంపిణీ చేయడం జరిగింది.

సేంద్రీయ వ్యవసాయ సాగు కింద మిర్చి,పత్తి, కంది, నిమ్మ,బొప్పాయి, మునగ, క్యారెట్, తదితర పంటలు సాగు చేస్తున్నారు.

మిర్చికి బొబ్బర తామర తెగులు ఉధృతి ఎలా ఉంది.

సాగు మిర్చి సాగులో సాళ్లకు మధ్య ఉల్లి, బంతి పూలు, దుంప,తీగ పంటలు సాగు చేయడం వలన ప్రధాన పంటలకు నష్టం కలిగించే మిత్ర పురుగులు ఉధతి అరికట్టడం జరుగుతున్న నేపథ్యంలో మిర్చి పంటలకు ఆయా తెగుళ్ల బెడద లేకుండా ఉత్పత్తులు అధిక ధరలకు అమ్ముకుంటున్నారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

రాష్ట్రంలోని వెనుక బడిన తరగతుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మహాత్మ జ్యోతిరావు పూలే, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, భారతరత్న బాబు జగజీవన్ రామ్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తున్నారని పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ప్రశంసించారు. సామాజిక తత్వవేత్త, కుల వ్యవస్థ నిర్మూలన వాది, బహుజన ఉద్యమకారుడు మహాత్మ జ్యోతిరావు గోవిందరావు పూలే విగ్రహ ఆవిష్కరణ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సభకు రాష్ట్ర మాల మహాసభ అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయంగా, ఆర్థికంగా, సామా జికంగా బీసీలు అభివద్ధి సాధించి నప్పుడు వెనుకబాటు తనం దూరం అవుతుందని ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన రెడ్డి విశ్వాసమని, ఆ దిశగా ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్న ఘనత సీఎంకే దక్కుతుందన్నారు. రాజ్య సభ సభ్యులు, మోపిదేవి వెంకటరమణ రావు మాట్లాడుతూ ప్రతి పౌరుడు సమాజంలో గౌరవ మర్యాదలతో విరాజిల్లటానికి విద్య ఇంధనంగా పనిచేస్తుందని అన్నారు. గౌరవ అతిథిగా పాల్గొన్న డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగంలో స్త్రీలకు మనోభావాలు, కోర్కెలు నెరవేర్చాలని ఆలోచన ఉండాలని పొందు పరిచారన్నారు. పొన్నూరులో ఆటోనగర్ ఏర్పాటుకు కృషి జరుగుతోందని చెప్పారు. వైసిపి బీసీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ జంగా కష్ణమూర్తి మాట్లాడుతూ సామాజిక వివక్షతకు గురైన వర్గాలకు మార్గాన్ని అన్వేషించిన మహెూన్నత వ్యక్తి పూలే అన్నారు. అనంతరం అతిథులను ఘనంగా సత్కరించారు. విగ్రహ నిర్మాణ దాత, ముదిరాజ్ ఐక్య మహాసభ వ్యవస్థాపకులు మాకాని రమేష్ బాబు, బీసీ నాయకులు కొల్లేరు శ్రీనివాసరావు, స్టేట్ మైనార్టీ కమిషన్ సభ్యులు షేక్ సైపుల్లా, ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు బొద్దులూరి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

ప్రజాశక్తి - మాచర్ల

వెల్దుర్తి మండలం గుండ్లపాడు గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. రెంటచింతల గ్రామానికి చెందిన పోసాని కోటయ్య లక్ష్మమ్మలు బంధువుల ఇంటి జరిగే శుభ కార్యానికి ద్విచక్ర వాహనంపై గుండ్లపాడు వచ్చారు కార్యక్రమం అనంతరం తిరుగు ప్రయాణంలో గుండ్లపాడు గ్రామం దాటాక కుక్క అడ్డు రావడంతో వాహనం అదుపు తప్పి కింద పడ్డారు ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి 108 ద్వారా మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు వెల్దుర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు గొలుసు చోరీ

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి పట్టణ పరిధిలోని శాలివాహన పేటలో ఆదివారం మధ్యాహ్నం చోరీ జరిగింది. ఇంటిలో నిద్రిస్తున్న బాపనపల్లి జయమ్మ అనే వద్ధురాలి నివాసంలోకి చొరబడిన గుర్తు తెలియని దుండగుడు ఆమె మెడలోని 3 కాసుల (24 గ్రాములు) గొలుసు ను తెలుపుకుని పరారయ్యాడు.దీనితో బాధితురాలు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

బాధితురాలు బాపనపల్లి జయమ్మ ఫిర్యాదు మేరకు మంగళగిరి పట్టణ సీఐ మల్లికార్జునరావు, ఎస్సైలు మహేంద్ర,కోటేశ్వరరావు లు సిబ్బంది శాలివాహన పేటలోని ఆమె నివాసానికి చేరుకున్నారు. చోరీ జరిగిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. చుట్టు ప్రక్కల సీసీ కెమెరాలు ఆధారంగా నిందితుడి ఆచూకీ కోసం పోలీసులు దర్యాప్తు చేపట్టారు. చుట్టు ప్రక్కల వారిని విచారించారు. సిసిఎస్ పోలీసులకు సమాచారం అందించారు. సుమారు గత ఏడాది క్రితం ఈ ప్రాంతంలో ఇదే తరహాలో చోరీ జరిగిందని పోలీసులు చెబుతున్నారు. సాధ్యమైనంత త్వరగా నిందితుడిని అదుపులోకి తీసుకొని కేసును చేదిస్తామని సీఐ మల్లికార్జునరావు తెలిపారు.

ఎన్జీవో నివాస స్థల పత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

ఎన్జీవో ఉద్యోగుల నివేశన స్థలాల కల సాకారం కావటం సంతోషదాయకమని ఎమ్మెల్సీ, ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు అన్నారు. ఏపీ ఎన్జీవో అసోసియేషన్ పొన్నూరు తాలూకా యూనిట్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్జీవో కాలనీ లో ఆదివారం ఏర్పాటుచేసిన ఎన్జీవో నివేశన స్థలాల ప్లాట్ల రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ పంపిణీ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సభకు ఏపీ ఎన్జీవో అసోసియేషన్ గుంటూరు జిల్లా శాఖ అధ్యక్షులు ఘంటసాల శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రెండున్నర దశాబ్దాలు కాలంగా మరుగున పడి ఉన్న ఎన్జీవో ఉద్యోగుల నివేశన స్థలాల రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు పంపిణీకి కృషి చేసిన పొన్నూరు తాలూకా యూనిట్ ఎన్జీవో అసోసియేషన్ నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు. ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ పొన్నూరు నియోజకవర్గంలో గత 25 సంవత్సరాలుగా దీర్ఘకాలిక సమస్యలు ఉన్నాయని వాటిని ప్రాధాన్యత ఇచ్చి దశలవారీగా పరిష్కరించటం జరుగుతుందన్నారు. అంతకుముందు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, కిలారి వెంకట రోశయ్య చేతుల మీదుగా పొన్నూరు ఎన్జీవో కాలనీని ప్రారంభించారు. అనంతరం 18 ఎకరాల లో ప్లాట్లు వేసిన 230 మంది ఉద్యోగులకు గాను 60 మందికి రిజిస్ట్రేషన్లు పూర్తయిన డాక్యుమెంట్లను ఉద్యోగులకు అందజేశారు.

అనుమానాస్పద స్థితిలో మృతి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పట్టణంలోని మంచినీటి చెరువు దగ్గరలో 52 ఎకరాల్లో పేదల కోసం నిర్మించిన టిడ్కో గృహాల సముదాయంలో మహిళ అను మానాస్పద స్థితిలో మృతి చెందింది. పోలీసుల వివరాల ప్రకారం రూ. 500 కు చెందిన టిడ్కో గృహంలో సుమారు మూ డు రోజుల క్రితం షేక్ ముంతాజ్ (43) మృతి చెందింది. ఆ గదిలో నుంచి దుర్వాసన వస్తోందని పక్క గృహాల వాళ్లు ఫోన్ ద్వారా తెలిపినట్లు సి.ఐ సీతారామయ్య ఆదివారం తెలిపారు. ఆమెకు పాప,బాబు ఉన్నా రని, భర్త చనిపోయినట్లు తెలిపారు. పోస్ట్‌మార్టం అనంతరం మృతదేహాన్ని ఆమె తల్లికి అప్పగించినట్లు తెలిపారు. ఆమె, కృష్ణమహల్ వద్ద వంట పను లకు, ఇతర కూలి పనులు చేసుకుని జీవనం సాగించేదని చెప్పారు. తల్లి ఆదాంబి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

హత్య కేసులో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-గుంటూరు సిటీ

మూడు రోజుల క్రితం శ్యామల నగర్ రైల్వే గేటు వద్ద డిఆర్ఎమ్ రోడ్ లో జరిగిన బండి కట్ల అమృతాచారి హత్య కేసు కు సంబంధించిన నిందితులను పట్టాభిపురం పోలీసులు శనివారం అరెస్టు చేశారు పట్టాభిపురం సీఐ తెలిపిన వివరాల ప్రకారం సీతమ్మ కాలనీకి అమత చారి హత్య కేసులో నిందితులైన చెందిన నిందితులైన గంజా వెంకటేశ్వరావు, చల్ల వెంకటేశ్వర్లు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఉచిత గుండె వైద్య శిబిరం

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

రోటరీ క్లబ్ ఆఫ్ పొన్నూరు ఆధ్వర్యంలో విజయవాడ హెల్ప్ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ వారిచే స్థానిక పాత పొన్నూరు బాల కోటేశ్వర స్వామి దేవస్థానం కళ్యాణ మండపంలో ఆదివారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరం నందు 300 మంది హృద్రోగులు వైద్య పరీక్షలు చేయించుకోగా, 50 మంది గుండె జబ్బుతో బాధపడుతున్న వారిని మెరుగైన చికిత్స నిమిత్తం,గుండె ఆపరేషన్లకు ఎంపిక చేశారు.

వేలం ప్రకటన

IN THE COURT OF THE IV ADDL. SENIOR CIVIL JUDGE, GUNTUR
E.P. No. 55 / 2019 in O.S. No. 699/ 2010
Between:
M/s. Kalpataruvu Chits Rep. by its GPA Holder. ...DHR
And
1) Desireddy Siva Rama Krishna Reddy, 2)Kotha Purnachandra Rao ...JDR's.

పైనెంబరు ఇ.పి.లో ఇస్తిహారు జారీకాబడి జప్తు ఖాయమైన 2వ జె.డి.ఆర్.తాలూక ఆస్తిని వేలం వేయుటకు శ్రీకోర్టువారు **ది.14-11-2023**వ తేదికి వాయిదావేసినారు. కావున వేలంపాటలో పాల్గొన దలచినవారు వాయిదారోజున **ఉ॥గం॥ 10-30ని॥**లకు పై కోర్టు వారి ఎదుట హాజరై వేలంపాటలో పాల్గొని పాట పాడు కొనవచ్చును. కోర్టువారి షరతులకు లోబడి పాటజరుగును.

Schedule:Property situated at Guntur Dt., & Sub-Dt., GMC limits, Near Gandhi Statue, Koritipadu, 3rd Lane, Ramannapet, Munispal Old Ward No.1,New Ward No. 2, Block No. 7, T.S.No.456, Door No:4-3-46, Asst. No.6289, R.C.C.House bounded by **East:** House belonging to Potti Hanumantha Rao,27.6 Ft. **South:**Galli Bazar-28.6Ft.,**West:**Muncipal Road-27.6Ft.,**North:**Property belonging to Bijinepalli Venkateswra Rao and others-28Ft.Within these boun -daries an extent of 87 ½ Sq. Yards of site and R.C.C Daba house with Madras bars consisting of ground floor and first floor with all appurtenances therein.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

డి. హెచ్. ఆర్ విలువ రూ. 26,00,000/-
అమీనా విలువ రూ. 60,00,000/-
వేలం వాయిదా ది. 14-11-2023
ఫర్దర్ హియరింగ్ ది. 21-11-2023.

కళ్యాణం కృష్ణమూర్తి, డి.హెచ్.ఆర్. తరపు అడ్వకేట్,
సీతారామ్ నగర్, 5వ లైను, గుంటూరు. సెల్: 9440260914

గ్రూప్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ధరణికోట విమల

7న సత్తెనపల్లికి ప్రజారక్షణ భేరి బస్సుయాత్ర రాక

ప్రజాశక్తి-సత్తెనపల్లి

కేంద్రంలోని బిజెపి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో రాష్ట్రం అధోగతి పాలవుతోందని సిపిఎం పట్టణ కార్యదర్శి ధరణికోట విమల విమర్శించారు. ఆదివారం పట్టణంలోని రంగాకాలనీ, మాస్టింగ్‌పేట ప్రాంతాలలోని గ్రూప్ మీటింగ్‌లలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా విమల మాట్లాడుతూ బిజెపి అనుసరిస్తున్న వినాశకర విధానాలకు ప్రత్యామ్నాయంగా సిపిఎం చేపట్టిన ప్రజారక్షణ భేరి బస్సు యాత్ర ఈ నెల 31న కర్నూల్‌లో బయలుదేరి నవంబర్ 7న సత్తెనపల్లి చేరుకుంటుందని చెప్పారు. ఈ సందర్భంగా సత్తెనపల్లి తాలూకా సెంటర్లో జరిగే బహిరంగ సభకు ప్రజలు తరలిరావాలని పిలుపు నిచ్చారు. సిపిఎం నాయకులు జడ రాజ్ కుమార్, నాణిక్య నాయక్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

సిపిఎం ప్రణాళికకు మద్దతు తెలపండి

ప్రజాశక్తి-సత్తెనపల్లి

బిజెపి అనుసరిస్తున్న కార్పొరేట్ కమ్యూనల్, విధానాలను నిరసిస్తూ ప్రత్యామ్నాయంగా సిపిఎం ప్రజల ముందు ఉంచుతున్న ప్రణాళికకు మద్దతు తెలపాలని సిపిఎం సత్తెనపల్లి మండలం కార్యదర్శి పెండ్యాల మహేష్ విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి విడిపోయిన తర్వాత మన రాష్ట్రానికి అలాగే, పల్నాడు జిల్లాకు కూడా వ్యవ సాయమే ప్రధాన జీవనాధారమని అన్నారు. అటువంటి వ్యవసాయం తీవ్రమైన సంక్షోభంలో ఉన్నప్పటికీ పాలకులు పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పల్నాడు జిల్లాలో గత సంవత్సరం కూడా లక్షన్నర ఎకరాలు సాగు భూమి బీడుగా మారిందని, కేవలం పంటలు గిట్టుబాటు కానందున, ఈ సంవత్సరం వర్షాలు అనుకూల వాతా వరణంతో సగం పైర్లు అసలు వేయ లేదని, వేసిన భూమిలో కూడా పైర్లు ఎండి పోతున్నాయని అన్నారు. సిపిఎం ప్రజల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని 30 డిమాండ్లను రూపొందించి, ఆ డిమాం డ్లను సాధించటం కోసమే బిజెపికి వ్యతిరేకంగా విశాల శక్తులను ఏకం చేయడానికి కృషి చేస్తోందని అన్నారు. నవంబర్ 15న విజయవాడలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం కమిటీ సభ్యులు వి. తులసి రామ్, ఎం.నరసింహారావు, సిహెచ్ లక్ష్మీ నారాయణ, బి.రామారావు, జె భగత్, మేరిమ్మ, అనూష పాల్గొన్నారు.

ఫ్రీజర్ వితరణ

ప్రజాశక్తి - యడ్లపాడు

యడ్లపాడుకు చెందిన తుర్లపాటి చిన భోగి లింగాచారి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు సాధన సేవా సంస్థ సహ కారంతో రూ.70 వేల విలువైన ఫ్రీజర్ బాక్స్ వితరణ చేశారు. అవసరమైన వారికి అన్ని వేళలా అందుబాటులో ఉంచే నిమిత్తం యడ్లపాడు లోని భూషయ్య మెమోరియల్ నర్సింగ్ హోమ్ యాజమాన్యానికి అప్పగించి నట్లు సాధన సేవ సంస్థ నిర్వాహకులు కేతా రామబ్రహ్మం తెలిపారు. ఫ్రీజర్ అవసరమైన వారు 99083 99169, 99080 56033 సెల్ నంబర్లలో లేదా నేరుగా ఆసుపత్రి సిబ్బందిని సంప్రదించాలన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడదాం

సమావేశంలో మాట్లాడుతున్న వై.రాధాకృష్ణ

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ఎన్‌డిఎ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కలసి వచ్చే పార్టీలన్నింటినీ కలుపుకుని పోరాడేందుకు సిద్ధమవ్వాలని పల్నాడు జిల్లా సిపిఎం కార్యదర్శివర్గ సభ్యులు వై.రాధాకృష్ణ అన్నారు. స్థానిక పండరీపురంలోని సిపిఎం కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశం జరిగింది. సమావేశానికి యడ్లపాడు మండల కార్యదర్శి తోకల కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముం దుగా పని ఒత్తిడి కారణంగా ఇటీవల చనిపోయిన ఆశా వర్కర్ కృపమ్మకు, జనవిజ్ఞాన వేదిక,పార్టీ సాను భూతి పరులు జంపని శ్రీహరిబాబుకు, వామపక్ష ఉద్యమాలలో చనిపోయిన వారికి, పాలిస్తీనాలో యుద్ధంలో చనిపోయిన వారికి సంతాపం తెలియజేశారు. అనంతరం రాధాకృష్ణ మాట్లాడుతూ నవంబర్ 8వ తేదీ ఉదయం పట్టణంలోని కళామందిర్ సెంటర్‌లో 'చలో ప్రజా రక్షణ భేరి' జాత సందర్భంగా ఉదయం 8 గంటలకు జరిగే బహిరంగ సభను, 15వ తేదీన విజయవాడలో జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మణిపూర్ ఘటనలో ప్రధాని మోదీ ఇంత వరకూ నోరు విప్పక పోవడం దారుణమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పని తీరును ఎండగట్టాలని, జమ్మూ హోదా రద్దు, రామ మందిరం నిర్మాణం,సివిల్ కోడ్లు, జిఎస్‌టి వసూలు, రాష్ట్రాల హక్కులు, పన్నులను హరించేలా ఉన్నాయని విమర్శించారు. ఫాసిస్టు బిజెపి ప్రభుత్వ విధానాలు, కార్మిక చట్టాలు, ఉపాధి హామీ, విద్యుత్ సంస్కరణలు మొదలైన అంశాల గురించి ప్రస్తావించిన ఆయన, ఆయా విధానాలు పేదలు భరించలేనివిగా ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం యడవల్లి, మురికిపూడి తదితర గ్రామాల్లో దళితుల భూముల విషయంలో 2013 భూసేకరణ చట్టాన్ని మరిచి అన్యాయంగా వ్యవహరించిం దని, ప్రశ్నించిన వారిపై ఇడి, సిబిఐ, ఇన్‌కమ్ ట్యాక్స్ దాడులు చేయిస్తున్నారని, చివరకు విలేకరులను కూడా వదలడం లేదని, రాష్ట్ర ప్రభుత్వం పే దలకు సంక్షేమ పథకాలు కొన్ని మాత్రమే ఇచ్చారని అన్నారు. సిపిఎం పట్టణ కార్యదర్శి పేరుబోయిన వెంకటేశ్వర్లు మాట్లా డుతూ బిజెపి ప్రభుత్వం వచ్చే ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి రాకుండా ఓడిం చాలని అన్నారు. కేంద్రంలో ఏ విధానాలను అయితే అవలంబిస్తోందో తూచా తప్ప కుండా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని విమర్శించారు. అనంతరం మండలాల వారీగా చర్చల్లో పాల్గొన్నారు. ఈ నెల 30,31 తేదీల్లో నాదెండ్ల,యడ్లపాడు మండలాల్లో, నవంబర్ నెల 2 నుంచి 6 వరకు చిలకలూరి పేట మండలంలోని గ్రామాల్లో తిరిగి ప్రజా సమస్యలు తెలుసుకుంటారని చెప్పారు. సమావేశంలో బి. శంకరరావు, కారుచోళ రోశయ్య, పి.భారతి, పి.శివపార్వతి, సంతోష, ఎం.కాళిదాసు, సాతు లూరి బాబు,టి. సుబ్బారెడ్డి, బి.కొటా నాయక్. తియ్యగూర ప్రతాప్‌రెడ్డి, సుబ్బారావు, ఎం.విల్సన్ పాల్గొన్నారు.

ప్రజాశ్రేయస్సు కాపాడటమే కర్తవ్యం

సమావేశంలో మాట్లాడుతున్న ఏపూరి గోపాలరావు

ప్రజాశక్తి- పల్నాడు జిల్లా

అసమానతలు లేని సమాజ అభివృద్ధి సాధనకు సిపిఎం పోరాటాలు చేస్తోం దని, ప్రజా శ్రేయస్సు, దేశ, రాష్ట్ర భవిష్యత్తు కాపాడడమే తమ ముందున్న కర్తవ్యమని, ఈ నేపథ్యంలో సిపిఎం చేపట్టిన ప్రజా రక్షణ భేరి బస్సు యాత్రను జయప్రదం చేయాలని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు పిలుపునిచ్చారు. స్థానిక కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నియోజకవర్గ స్థాయి సిపిఎం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సరికొండ వెంకటేశ్వర రాజు అధ్యక్షత వహించారు. ముందుగా ఇటీవల మృతి చెందిన వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.ఎస్ స్వామినాథన్‌కు సంతాపం తెలిపారు. గోపాలరావు మాట్లాడుతూ అభివృద్ధి గురించి పాలక పక్షాలు, ప్రతి పక్షాలు మాట్లాడతాయి కానీ, ఆచరణలో లేదని ఎద్దేవా చేశారు. వైసిపి ప్రభుత్వం నగదు బదిలీ పథకాలకు మాత్రమే పరిమితమైందని, దీని ద్వారా రాష్ట్రాభివృద్ధి చెం దదని అన్నారు. పల్నాడులో అన్ని వనరులు ఉన్నప్పటికీ అభివృద్ధి పరంగా వెనుక బడటం ప్రభుత్వాల వైఫల్యమేనని విమర్శించారు. కార్పొరేట్ కుటుంబాలు, స్వామినాథన్ కమిటీ సిఫార్సులు, రైతులు- మద్దతు ధరలు - రుణమాఫీ, వ్యవసాయ మోటార్లు, విశాఖ ఉక్కు పరిశ్రమ, కార్మికులు-లేబర్‌కోడ్లు, ఎపికి ప్రత్యేకహోదా, ఆరోగ్య శ్రీ , నాడు-నేడు పథకాలు, ప్రభుత్వ పాఠశాలల మూసివేత, అంగన్వాడీల సమస్యలు, ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు, మునిసిపల్ కార్మికులు సరైన వేతనాలు, గ్రామాల్లో హరితరాయబారులకు జీతాలు సక్రమంగా ఇవ్వకపోవడం, బిజెపి కుట్రలు, మతోన్మాదం, మహిళలు, రాజ్యాంగం, మనుస్మృతి మొదలైన అంశాల గురించి ప్రస్తావించారు. వైసిపి, టిడిపి జనసేనలు మోడీ జపం చేస్తూ రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నా యని విమర్శించారు. అన్ని రంగాలను అభివృద్ధి చేస్తే యువత విదేశాలకు వెళ్లాల్సిన అవసరం ఉండేది కాదన్న విషయాన్ని బిజెపి గుర్తించాలని అన్నారు. అన్ని రాష్ట్రాల్లో కేరళ తరహా విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల అభివృద్ధికి ఆయా పార్టీలు కట్టుబడి ఉండాలన్నారు. అనంతరం సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు డి.శివకుమారి, టి.పెద్దిరాజు మాట్లాడారు. ఇచ్చిన మాట ప్రకారం మద్యపాన నిషేధం చేసి ప్రజల్లోకి వెళ్లి ఓట్లు అడగాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు ఎవికె దుర్గారావు, సిపిఎం పట్టణ కార్యదర్శి షేక్ సిలార్ మసూద్, నాయకులు కె.ఆంజ నేయులు, బి.నాగేశ్వరరావు, రూరల్ శాఖ కార్యదర్శి మేడం ఆంజనేయులు, మస్తాన్ వలి షేక్ అష్రఫ్ పాల్గొన్నారు.

ద్రోహం చేసిన బిజెపికి వంతపాడుతున్న పార్టీలు

ప్రజాశక్తి - క్రోసూరు

ప్రజా మేనిఫెస్టో బ్రోచర్ ని ఆవిష్కరిస్తున్న గుంటూరు విజయ్ కుమార్ , జి.రవిబాబు , టి.హనుమంతరావు, ఆర్. వెంకటేశ్వర్లు తదితరులు

ఆంధ్ర రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపికి అను కూలంగా వైసిపి,టిడిపి, జనసేన పార్టీ వ్యవహరించ డం దుర్మార్గమని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి జి.విజయ్‌కుమార్ విమర్శించారు. పెదకూరపాడు నియోజకవర్గంలోని పార్టీ సభ్యులు, సానుభూతి పరుల జనరల్ బాడీ సమావేశం స్థానిక ఆమంచి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగింది. సమావేశానికి బి.సూరిబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విజయ కుమార్ మాట్లాడుతూ విభజన హామీలేవీ అమలు చేయకుండా, పోలవరం నిర్మాణాన్ని చేపట్ట కుండా, విశాఖ ఉక్కును అమ్మాలని చూడటం ప్రజ లను మోసం చేయడమేనని విమర్శించారు. కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణాన్ని చేపట్టకుండా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి, రాజధాని నిర్మాణానికి నిధులు ఇవ్వక పోయినా రాష్ట్ర ప్రభుత్వం పట్టీపట్టనట్లు వ్యవహరించడం దుర్మార్గమని విమర్శించారు. బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను రాష్ట్రంలో అమలు చేసేం దుకు అధికార వైసిపి, ప్రతిపక్ష పార్టీలు టిడిపి, జనసేనలు వంతపాడుతున్నాయని అన్నారు. అవకాశవాద పార్టీల వైఖరికి ప్రత్యామ్నాయంగా సిపిఎం ప్రజా మేనిఫెస్టో ఆధారంగా సమగ్ర అభివృద్ధి జరగాలని రాష్ట్ర వ్యాప్తంగా మూడు చోట్ల నుండి బస్సు యాత్రలు నిర్వహిస్తోందని చెప్పారు. 7న సత్తెన పల్లిలో, 15న విజయవాడలో జరిగే బహిరంగ సభల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి . రవి బాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న ప్రధాన రాజకీయ పార్టీలు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయకుండా కేవలం ఓట్ల రాజకీయమే చేస్తున్నాయని విమర్శించారు. పెదకూరపాడు, క్రోసూరు మండలాల్లో సాగర్ అయకట్టు చివరి భూముల్లో వేలాది ఎకరాల్లో మిరప పంటకు సాగర్ నీరు అందక ఎండిపోయే పరిస్థితి దాపురించిందని అన్నారు. సాగర్ నీటిని వెంటనే విడుదల చేయాలి లేదా పంటల బీమా కింద స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం నష్ట పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.పత్తిని ఎనిమిది వేల రూపాయలు మద్దతు ధరకు కొనుగోలు చేయించాలని,సాగు భూములకు శాశ్వతనీటి సౌకర్యం అందిం చాలని విజ్ఞప్తి చేశారు. జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణం సామాన్య ప్రజలకు భారమైందని అన్నారు. ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో క్రోసూరు మండల కార్యదర్శి టి. హనుమంత రావు, అచ్చంపేట మండల కార్యదర్శి ఆర్. వెంకటేశ్వర్లు, పెదకూరపాడు మండల కార్యదర్శి డి.శేషా రావు, ఎ.ఆంజనేయులు,ముత్యాల పౌలు, దుర్గారావు, సిహెచ్ యేసయ్య, వై. వెంకటేశ్వర్లు, జి.మహేష్, షేకు ముస్తఫా, శాఖమూరి మోహనరావు,టి.చుక్కయ్య, శాఖమూరి సాంబయ్య, షేక్ మోహిదీన్, కె.యేషయ్య పాల్గొన్నారు.

ఏషియన్ రోలర్ స్కేటింగ్ పోటీల్లో

సిల్వర్ మెడల్ గ్రహీత తేజేష్‌కు ప్రశంసలు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

చైనాలో జరుగుతున్న 19వ ఏషియన్ రోలర్ స్కేటింగ్ ఛాం పియన్ షిప్- 2023 పోటీల్లో భారతదేశం తరపున పాల్గొని సిల్వర్ మెడిల్ సాధించిన పడిగ తేజేష్ దేశానికి గర్వ కారణమని ఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ మల్లెల రాజేష్ నాయుడు అన్నారు. స్థానికంగా తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మురికి పూడికి చెందిన ఈ తేజేష్ ఈ ఘనత సాధించడం సంతోషకం మని అన్నారు. ఈ సందర్భంగా అతన్ని అభినందించారు. భవి ష్యత్తులో మరిన్ని పతకాలు తేజేష్ సాధించాలని, అంతర్జాతీయ స్థాయిలో మొదటిస్థానంలో నిలబడే క్రీడాకారుడిగా ఎదగాలని ఆకాంక్షించారు.

కృత్రిమ పాదాలు పంపిణీ

ప్రజాశక్తి - మాచర్ల

చేతన ఫౌండేషన్, బార్జిలై ఫౌండేషన్‌ల ఆర్థిక సహకారంతో వాసవి క్లబ్ రోటరీ క్లబ్ లు వికలాంగులకు కృత్రిమ పాదాలను అందజేశారు. స్థానిక వియల్ దత్ ఆడిటోరియంలో ఆదివారం జరిగిన ఈ కార్య క్రమంలో 85 మంది వికలాంగులకు కృత్రిమ పాదాలను అమ ర్చారు. ఈ కార్యక్రమంలోనే వికలాంగురాలు సైదాబీకి ట్రై సైకిల్, పోలిశెట్టి మాధవి ,లక్ష్మీదేవులకు కుట్టు మిషన్లు స్థానిక క్లబ్బుల ద్వారా అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు కేశవ కిషోర్, వెనిగళ్ళ అనిల్ కుమార్, రోటరీ అధ్యక్ష కార్యదర్శులు చిన్ని సత్యనారాయణ, పటాన్ నాగూర్ వలి, వాసవి క్లబ్ అధ్యక్షులు ఒరుగంటి చెన్నకేశవరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.60కే లీటరు పెట్రోల్ ఇవ్వాలి : సిపిఎం

- ప్రత్యామ్నాయ ప్రణాళికపై ప్రచారం
- ప్రజారక్షణభేరిని జయప్రదం చేయాలని పిలుపు
- పలుచోట్ల పోస్టర్లు ఆవిష్కరణ

మంగళగిరి మండలం నిడమర్రులో ప్రచారం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

సిపిఎం ఆధ్వర్యంలో 15న విజయవాడలో నిర్వహించే ప్రజారక్షణ భేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి కోరారు. ఈ మేరకు మండలంలోని నిడమర్రులో ప్రచారాన్ని ఆయన ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, అసమానతలు లేని అభివృద్ధి కోసం ప్రజారక్షణ భేరిని సిపిఎం నిర్వహిస్తోందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా, విభజన హామీలు అమలు చేయకుండా రాజధానికి ఎనిమిది బడ్జెట్లలో నిధులు కేటాయించకుండా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీవ్ర ద్రోహం చేసిందని విమర్శించారు. ప్రజా ఉద్యమాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నాయని, ఈ విధానాలను ప్రజలంతా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అమరావతినే రాజధానిగా కొనసాగించాలని, రాజధాని రైతులు, అసైన్డ్ రైతులకు పెండింగ్ కౌలును చెల్లించాలని, రాజధాని పేదలకు ఇస్తున్న సామాజిక పింఛనును రూ.5 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెండు సెంట్లు ఇళ్ల స్థలం, ఇళ్లకు రూ.ఐదు లక్షల ఆర్థిక సాయం, నివాస ప్రాంతాల్లోనే ఇళ్ల పట్టాలు ఇవ్వాలన్నారు. పన్నుల భారం తగ్గించాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్‌లకు నిధులివ్వాలని, అసంఘటిత కార్మికులకు రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలని కోరారు. గ్యాస్‌ను రూ.400కు, లీటరు పెట్రోల్ రూ.60కు, రూపాయికి యూనిట్ విద్యుత్ ఇవ్వాలన్నారు. ఇసుకను ఉచితంగా సరఫరా చేయాలని కోరారు. అందరికీ నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం, తాగునీరు అందించాలని, పంటలకు మద్దతు ధరలు, వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అమలు చేయాలన్నారు. ఈ డిమాండ్లపై సిపిఎం నిర్వహించే పోరాటాల్లో ప్రజలు కలిసి రావాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం.భాగ్యరాజు, వి.వెంకటేశ్వరరావు, జి.నాగేశ్వరరావు, కె.నాగేశ్వరరావు, ఎం.అంకమ్మరావు, కె.నానయ్య, ఎమ్మెల మరియదాసు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తాడేపల్లి మండలం గుండిమెడలో పోస్టర్ ఆవిష్కరణ

తాడేపల్లి ఎమ్మెల రామయ్య కాలనీలో..

ప్రజాశక్తి-తాడేపల్లి

నవంబర్ 15న విజయవాడలో నిర్వహించే ప్రజారక్షణ భేరికి తరలిరావాలని సిపిఎం పట్టణ నాయకులు వి.దుర్గారావు కోరారు. ఆదివారం నులకపేటలో ఎమ్మెల రామయ్య కాలనీలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి రోడ్లు, ఫ్లైఓవర్లు కాదని, అందరూ సమానంగా అసమానతల్లేకుండా జీవించాలని, అదే నిజమైన అభివృద్ధి అని అన్నారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలను అజెండా చేయడమే ప్రజా రక్షణ భేరి లక్ష్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లేశ్వరి, వెంకన్న, ఎం.దుర్గారావు, రమణ పాల్గొన్నారు. సుందరయ్యనగర్‌లో నిర్వహించిన సమావేశానికి పి.రామచంద్రరావు అధ్యక్షత వహించగా మార్క్సిస్ట్ పత్రిక ఎడిటర్ ఎస్.వెంకట్రావు మాట్లాడారు. పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, కె.కరుణాకరరావు, పి.గిరిజ, సిహెచ్.భుజంగరావు, కె.ఉషారాణి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం చేసే ప్రజారక్షణ భేరి బస్సు యాత్రను జయప్రదం చేయాలని, సిపిఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు అన్నారు. ఈ మేరకు పోస్టర్‌ను గుండిమెడలో ఆదివారం ఆవిష్కరించారు. శివశంకరరావు మాట్లాడుతూ సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీ నుండి నవంబర్ 14వ తేదీ వరకు బస్సు యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిపిఎం మండల కార్యదర్శి డి.వెంకటరెడ్డి మాట్లాడుతూ విభజన హామీలు సాధించడంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు విఫలమయ్యాయని అన్నారు. బిజెపి ప్రభుత్వ విధానాలను రాష్ట్ర ప్రభుత్వమూ అమలు చేస్తోందని విమర్శించారు. ప్రజలకు నష్టం చేసే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను ప్రజలు తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.కృష్ణ, ఎన్.విజయరాజు, బి.సంసోను, చిన్న, దావీదు, జోనేషు, రత్తయ్య పాల్గొన్నారు.

రఘువీరారెడ్డి, అజయ్‌సింగ్‌కు వినతిపత్రం ఇస్తున్న బిసి సంక్షేమ సంఘం నాయకులు

బిసి కులగణనకు కృషి చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

బిసి కులగణన అంశాన్ని కాంగ్రెస్ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి, కాంగ్రెస్ సిడబ్ల్యూసిలో తీర్మానం చేపట్టేటట్లు కృషి చేయాలని కాంగ్రెస్ సిడబ్ల్యూసి సభ్యులు ఎన్.రఘువీరారెడ్డిని బిసి సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఆదివారం గుంటూరు వచ్చిన రఘువీరారెడ్డి, ఒబిసి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు కెప్టెన్ అజయ్‌సింగ్ యాదవ్‌ను బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు కె.క్రాంతికుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.నాగమల్లేశ్వరరావు తదితరులు కలిసి వినతి పత్రం ఇచ్చారు. మండల్ కమిషన్ ప్రకారం 52 శాతం ఒబిసి కులాల వారున్నారని, వారికి దామాషా ప్రకారం చెందాల్సిన ఏ ఒక్కటీ అందుబాటులోకి రాలేదని తెలిపారు. కుల గణన ఒక్కటే దీనికి పరిష్కారమన్నారు. అనేక రాష్ట్రాల్లో కులగణన చేపడుతున్న ఈ దశలో కేంద్ర ప్రభుత్వం చోద్యం చూస్తోందని, ప్రతిపక్ష పార్టీగా బిసి జనగణనకు కాంగ్రెస్ కృషి చేయాలని కోరారు.

బహుమతులు అందుకున్న పోలీసులు, విద్యార్థులతో పోలీసు అధికారులు

విజేతలకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి - గుంటూరు సిటి

పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా జిల్లాలో నిర్వహించిన వక్తృత్వం, వ్యాసరచన పోటీల్లో విజేతలైన ఐదుగురు పోలీసు అధికారులతో పాటు 15 మంది పాఠశాల విద్యార్థులకు బహుమతులను ఎఆర్ డిఎస్‌పి చంద్రశేఖర్‌రావు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆదివారం ప్రదానం చేశారు. డిబేట్, వ్యాసరచన పోటీలో విజేతలుగా మంగళగిరి పోలీస్ స్టేషన్ చెందిన ఎన్.క్రాంతికుమార్, పెదకాకాని పోలీస్‌స్టేషన్‌కు చెందిన వి.సుధాకర్, పాత గుంటూరు పోలీస్‌స్టేషన్‌కు చెందిన బి.భాస్కర్, లాలాపేట ఎస్ఐ అమర్‌వర్ధన్, కానిస్టేబుల్ అరుణ్ కుమారి, గుంటూరు కానిస్టేబుల్ ఆర్.భాస్కర్‌తో పాటు విద్యార్థులైన చిన్ని, చైతవైన్య, ఎస్‌కె షబానం, వై.హాసిని, ఎస్.బిందు మాధవి, షణ్ముఖ ప్రియా, ఎం.కీర్తన, సిహెచ్ నివాస్, ఎస్.కె పర్దుస్, కృష్ణ, ఎస్.కె సనబుష్రా, స్నేహ సాయి, దీప్తి, శరణ్య బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ ఉత్సవాల సందర్భంగా పోలీసుల త్యాగాలను విద్యార్థులు, ప్రజలకు వివరించామని, అమరులైన పోలీసులకు ప్రతిరోజూ ఘన నివాళులర్పించామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐలు థామస్‌రెడ్డి, రాజారావు, రమేష్ కృష్ణన్, మంగారావు, చంద్రశేఖర్‌రావు, నాగార్జున పాల్గొన్నారు.

తాడేపల్లి సిఐ బదిలీ

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణ సిఐ శేషగిరిరావు చీరాల వన్‌టౌన్ సర్కిల్‌కు బదిలీ అయ్యారు. చీరాల రూరల్ సిఐ మల్లికార్జునరావు తాడేపల్లి సిఐగా బాధ్యతలు తీసుకోనున్నారు. ఈ మేరకు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న చాంద్‌బాషా

పిఆర్‌సిపై తక్షణమే సంఘాలతో చర్చించాలి

ప్రజాశక్తి-గుంటూరు

పిఆర్‌సి-2023 (వేతన సవరణ)పై చర్చించటానికి ఉద్యోగ సంఘాలను ఆహ్వానించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఎపిజిఇఎ) జిల్లా అధ్యక్షులు చాంద్‌బాషా కోరారు. ఆదివాంర నగరంపాలెంలోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 2023 జులై 1 నుండి పిఆర్‌సి అమలు చేసేందుకు ప్రభుత్వం తక్షణమే ఉద్యోగ సంఘాలతో చర్చించాలన్నారు. పిఆర్‌సి అమలు చేయని పక్షంలో ఐఆర్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని, తక్షణమే ఐఆర్ ప్రకటించాలని కోరారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు శ్యామ్ హుస్సేన్ ఖాన్, సంయుక్త కార్యదర్శి జి.శ్రీనివాసరావు, నగర అధ్యక్షులు వై.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఒకటో తేదీ నుండి రెండో బ్యాచ్‌కు కుట్టుశిక్షణ

ప్రజాశక్తి-తాడేపల్లి

స్థానిక అమరారెడ్డి భవన్‌లో కుట్టుశిక్షణ రెండో బ్యాచ్ ఒకటో తేదీన ప్రారంభమవుతుందని మహిళా నైపుణ్య శిక్షణా కేంద్రం నిర్వాహకులు సిహెచ్.వెంకటరత్నం, జి.సుబ్బారెడ్డి ఆదివారం తెలిపారు. మహిళలు స్వయం ఉపాధి సాధించేందుకు కుట్టుశిక్షణ ఉపయోగపడుతుందన్నారు. పెరుగుతున్న ధరల నేపథ్యంలో కుటుంబ ఆదాయానికి కొంత చేదోడు వాదోడుగా నిలుస్తుందన్నారు. సెప్టెంబర్ 15న ప్రారంభమైన మొదటి బ్యాచ్ విజయవంతంగా నడుస్తోందని, ప్రతిరోజు మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఐదు గంటల మధ్య శిక్షణ ఉంటుందని తెలిపారు. మూడు నెలల పాటు శిక్షణ పూర్తయిన తరువాత వారి నైపుణ్యాన్ని పెంచేందుకు నైపుణ్య కేంద్రం తోడ్పడుతుందన్నారు. ఆసక్తి గల వారు దరఖాస్తు, ఆధార్ జిరాక్స్, పాస్‌పోర్టు ఫొటోలతో పాటు రూ.వెయ్యి ప్రవేశ రుసుం చెల్లించాలని తెలిపారు.

జాతీయ స్థాయి క్విజ్ పోటీలకు నారాకోడూరు జెడ్‌పి పాఠశాల విద్యార్థి

ప్రజాశక్తి - చేబ్రోలు

జాతీయ స్థాయిలో ఒకటో తేదీన ఆన్‌లైన్‌లో నిర్వహించే టాటా కన్సల్టెన్సీ ఐటీ క్విజ్‌కు ఆంధ్రప్రదేశ్ తరుపున నారాకోడూరు జెడ్‌పి పాఠశాల 9వ తరగతి విద్యార్థి వి.ఆదిత్యవర్ధన్ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు ఎం.ఏడుకొండలు తెలిపారు. రాష్ట్రస్థాయిలో ఆన్‌లైన్ ద్వారా పోటీలు నిర్వహించగా గుంటూరు జిల్లా జట్టుకు ఆదిత్యవర్ధన్ ప్రాతినిధ్యం వహించారని, ఆ ఫలితాలు విడుదల చేయగా ఆదిత్య వర్ధన్ రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు ఎన్‌సిఇఆర్‌టి డైరెక్టర్ బి.ప్రతాప్‌రెడ్డి ప్రకటించారని చెప్పారు. ఆదిత్య వర్ధన్‌ను హెచ్‌ఎంతోపాటు వేజెండ్ల పాఠశాల హెచ్‌ఎం విజయశ్రీ, ఉపాధ్యాయులు నరేంద్ర, ఎం.వెంకటేశ్వరరావు, ఎ.శ్రీనివాసరావు, రంజిత్‌కుమార్ అభినందించారు.

క్విజ్ పోటీలకు ఎంపికైన ఆదిత్య వర్ధన్‌తో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

గట్టుపై చెట్లు నరికివేత

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండల కేంద్రం ముప్పాళ్లలో పంచాయతి చెరువు గట్టుపై ఉన్న పచ్చని చెట్లను అక్రమార్కులు నరికి వేశారు. ఆదివారం అధికారులు ఎవరు విధులకు రారని గుర్తించి చెట్లను నరికివేశారు. సుమారు గత ముప్పై సంవత్సరాలుగా చెరువు గట్టుపై ఉండి పొలం పనులు నిమిత్తం వెళ్ళే వారికి నీడనిస్తున్నాయి. కేవలం డబ్బులు కోసమే మండల కేంద్రంలో ఎక్కడ పచ్చని చెట్లు కనిపించిన నరికివేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

చెట్లను సుమారు రూ.50 వేల రూపాయలకు పంచాయతి పాలకవర్గ సభ్యులు తమకు విక్రయించారని చెట్లను నరికిన వ్యక్తులు చెబుతున్నారు. ఇక నైనా అధికారులు స్పందించి చెట్లను నరికే అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు .

సమావేశంలో మాట్లాడుతున్న ఫణిరాజ్

పేదలను చైతన్య వంతులను చేస్తాం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

'టాక్ ఫర్ నేషన్'కార్యక్రమాన్ని ఈ నెల 28న పల్నాడు జిల్లా నరసరావుపేట నుండి మొదలుపెట్టామని లిటిల్ హాండ్స్ ఆర్గనైజేషన్ ఫౌండర్ ఫణి రాజ్ సరోజిని అన్నారు. నరసరావుపేట ప్రకాష్ నగర్ లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫణిరాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలో 26 జిల్లాలలో పర్యటించి విద్య, వైద్యం, వ్యవసాయం , ఉపాధి అనే 4 అంశాలకు సంబంధించి ప్రజలను కలిసి వారి నుండి సలహాలు, సూచనలు సేకరించి ఎన్జీవో తరఫున ఒక నివేదిక తయారుచేసి ప్రభుత్వానికి అందజేస్తామని చెప్పారు. ఈ యాత్రలో వివిధ విద్యార్థి సంఘాలు, రైతు సంఘాలు, ప్రతిభావంతులను, ఎన్‌జిఒలను కలుస్తామని చెప్పారు. కార్యక్రమంలో లిటిల్ హాండ్స్ ఆర్గనైజేషన్ ట్రెజరర్ రాజీవ్ గుప్తా, సభ్యులు అంబేద్కర్, సంపత్, అమర్, హర్షిత తదితరులు పాల్గొన్నారు.

మట్టి ఖర్చులకు రూ.5 వేల సాయం

ప్రజాశక్తి - మాచర్ల

స్థానిక రెండవ వార్డుకు చెందిన కొమ్ము మాణిక్యం అనారోగ్యంతో మృతి చెందారు. మట్టి ఖర్చులు నిమిత్తం వారి కుటుంబానికి రూ.5,000 ఆర్థిక సాయాన్ని మాచర్ల మున్సిపల్ చైర్మన్ ఎంసిహెచ్ ఏసోబు అందజేశారు. మాణిక్యం పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ధైర్యం చెప్పారు.

'మంత్రుల బస్సు యాత్రను అడ్డుకుంటాం'

ప్రజాశక్తి-చిలకలూరిపేట

రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఏమీ ఘనత సాధించారని సామాజిక సాధికార బస్సు యాత్రను మంత్రులు చేస్తున్నా రని ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు బి. శ్రీను నాయక్ ప్రశ్నించారు. స్థానిక ఎన్.ఆర్.టి. సెంటర్లో గల ఆయన కార్యాలయంలో విలేకరులతో ఆదివారం మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, ఆయా సామాజిక వర్గీయులు వారి సంక్షేమ పథకాలను రద్దుచేసి దానికి సంబంధించిన నిధులను సంక్షేమ పథకాలకు వాడుకున్నందుకా? కార్పొరేషన్లు పెట్టివాటిని నిర్వీరామం చేసి ఆర్థికంగా, సామాజికంగా వెనుక బాటు తనానికి గురి చేయడమే కా కుండా కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇవ్వనందుకా , గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించడంలో విఫలమైనందుకా? గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో సమస్యలను, గిరిజన గురుకులాల్లో ఉపాధ్యాయ పోస్టులను,గిరిజన యూనివర్సిటీలను గా లి కి వదిలేసి నందుకా? ఒక్క ఛాన్స్ అని అధికారంలోకి వచ్చినందుకా? అని పలు ప్రశ్నలు సంధించారు. పల్నాడు జిల్లాలో వరిక పూడిశెల ప్రాజెక్ట్ పూర్తి చేస్తే వినుకొండ, మాచర్ల నియో జకవర్గంలోని సుమారు 50 మండల ప్రాంతాలకు చెందిన ప్రజలకుతాగునీరు,సాగునీరు లేకుండా ఉంటాయని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లో చిలకలూరిపేట లో బస్సు యాత్రను అడ్డుకుంటామని అని అన్నారు.

ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాల్లో

క్రోసూరులో 5,950 మందికి చికిత్స

ప్రజాశక్తి- క్రోసూరు

మండలంలో జగనన్న ఆరోగ్య శిబిరాలకు విశేష స్పందన లభించిందని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారిని డాక్టర్ రమాదేవి ఆదివారం పేర్కొ న్నారు. ఈ నెల 27వ తేదీతో మండలంలో శిబిరాలు నిర్వహణ ముగిసిందని మొత్తం 14 సచివాలయాల్లో 5,950 మందికి చికిత్స అందించి 70 మంది రోగులను రెఫర్ చేయడం జరిగిందని రెఫర్ చేసిన రోగులను ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు ఆయా ఆసుపత్రులకు తీసుకొని వెళ్లి వారికి మెరుగైన చికిత్స అందిస్తున్నటు చెప్పారు. ఆరోగ్య శిబిరాలలో తనకు సహాయం అందించిన డాక్టర్లకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి సచివాలయంలో వైద్యాధికారులకు ఘన సన్మానం జరిగిందని చెప్పారు.

బదిలీపై వెళ్తున్న పోలీసులకు ఘన సన్మానం

ప్రజాశక్తి-అమరావతి

అమరావతి పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన పోలీస్ సిబ్బంది కి ఆదివారం అమరావతి పోలీస్ స్టేషన్ ఆవరణలో సీఐ వీరబ్రహ్మం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ వీరబ్రహ్మం మాట్లాడుతూ విధి నిర్వహణలో వారు చేసిన సేవలను కొనియాడారు. పోలీస్ ఉద్యోగం అంటే బాధ్యతతో కూడుకుందని అన్నారు. శాంతిభద్రతలను కాపాడటంలో తనకు అండగా ఉన్నారని వీరబ్రహ్మం అన్నారు. బదిలీలు ఉద్యోగంలో భాగమని ఎక్కడ పనిచేసిన ప్రజలకు గుర్తుండే విధంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు వెంకటేశ్వర్లు, నాగేంద్ర, సుభాని, అమరావతి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల వారోత్సవాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

దేశ వ్యాప్తంగా విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసులను స్మరిస్తూ ప్రతి ఏడాది పోలీసు అమరవీరుల వారోత్సవాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా స్థానిక స్టేషన్ రోడ్డులోని గాంధీ పార్క్ వద్ద ఆదివారం పోలీస్ బ్యాండ్

ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీస్ బ్యాండ్ కార్యక్రమాలను ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

మల్లవరంలో పోలీసు సోదాలు

ప్రజాశక్తి - రెంటచింతల

రెంటచింతల మండలంలోని కష్ణా నది ఒడ్డున గల మల్లవరం గ్రామంలో ఆదివారం వేకువజామున కారంపూడి సిఐ దార్ల జయకుమార్, ఎస్సై శ్యామ్యూల్ రాజీవ్కుమార్, దుర్గి ఎస్ఐ శివ సిబ్బంది ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమ మద్యం కలిగి ఉన్న, అవతలి ఒడ్డు నుంచి నాటు సారా తెచ్చిన ఏ ఇతర నిషేధించబడిన వస్తువులు తనిఖీల్లో దొరికితే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్ అందజేత

ప్రజాశక్తి-చిలకలూరిపేట

సమాజానికి తమ వంతు సేవ చేయాలన్న తలంపు అభినందనీయమని ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు అన్నారు. స్థానిక పండరీపురంలోని రోటరీ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ పీవీ సుబ్బారావు, ఇన్నర్ వీల్ క్లబ్ మాజీ అధ్యక్షురాలు విజయలక్ష్మి దంపతుల వివాహ వార్షి కోత్సవాన్ని పురస్కరించుకొని రూ. 11 వేల విలువ చేసే కుట్టు మిషన్‌ను పేద మహిళ సునీతకు అందజేశారు. ఈ తరహా సేవల ను మిగిలిన వారూ స్ఫూర్తిగా తీసుకో వాలని ఇన్నర్‌క్లబ్ సభ్యులు పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ సహాయం పొందిన మహిళ మరికొందరికి కుట్టు శిక్షణ అందిస్తే వారిక కూడా తాము కుట్టుమిషన్ అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు ఇందిరా, పాస్ట్ ప్రెసిడెంట్ గట్టు సరోజిని, సభ్యులు ఉప్పాల రమాదేవి, నల్లపాటి రాజ్యా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సామాన్యుల సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

ప్రజాశక్తి - వినుకొండ

తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కార్యకర్తలు తమ శక్తివంచన లేకుండా కృషి చేయాలని పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జిబి ఆంజనేయులు కోరారు. ఆదివారం నరసరావుపేట రోడ్డులోని గంగినేని ఫంక్షన్ హాల్ లో జరిగిన వినుకొండ నియోజకవర్గం స్థాయి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సంద ర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల వైసిపి పాలనతో కార్మికులు, రైతులు సామాన్య ప్రజలు ఎదుర్కొన్న సమస్యలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని అన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి చైతన్యపరిచి తెలుగుదేశం పార్టీని మరింతగా బలోపేతం చేయాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే బ్రహ్మానాయుడు చేసిన అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలు ప్రశ్నించిన వారిపై అక్రమ కేసుల బనాయింపు అంశాలను ప్రజలకు క్షుణ్ణంగా వివరించాలని చెప్పారు. సమావేశంలో టిడిపి నాయకులు, పట్టణ పార్టీ అద్యక్షులు పఠాన్ ఆయుబ్ ఖాన్,మండల పార్టీ అద్యక్షులు జరపాల గోవిందు నాయక్.ఈపూరు మండల పార్టీ అద్యక్షులు తిరుమాల శెట్టి బాలయ్య,మాదినేని ఆంజ నేయులు. మీసాల మురళీకృష్ణ యాదవ్, గుంటూరు సాంబశివరావు, పెమ్మసాని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి శ్రేణులు నిరసన

ప్రజాశక్తి-పెదకూరపాడు

పెదకూరపాడు మండలంలో తెలుగుదేశం పార్టీ

నాయకులు కార్యకర్తలు కళ్లకు గంతలు కట్టి నిరసన తెలిపారు. ఆదివారం ఆ పార్టీ పిలుపుమేరకు పెదకూరపాడు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కొమ్మాలపాటి శ్రీధర్, టిడిపి మండల అధ్యక్షులు రమేష్, తోపాటు ప్రతి గ్రామంలో నాయకులు నిరసన వ్యక్తం చేశారు.

ప్రజాశక్తి - క్రోసూ రు

క్రోసూరులో 130 వ బూత్ లో బూత్ కన్వీనర్ బండారు మైసూరు బాబు అధ్వర్యంలో 'నిజం గెలవాలి' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ సర్కారుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ర్యక్రమంలో బండారు నాగరాజు,పరమేశ్వరి, ఎం. తులశమ్మ, జయమ్మ, లక్ష్మి, సీతామహాలక్ష్మి సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది చాలరు.. సరిపడా మందులు పంపరు..

- ప్రతినెలా చేతి చమురు వదిలించుకోవాల్సిందే
- పేరుకే వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయం

ప్రజాశక్తి-తెనాలి

పేరుకే ఉన్నతాధికారి కార్యాలయం.. అంతా అరకొరే. అవసరమైన స్థాయిలో మందుల సరఫరా ఉండదు. పెరిగిన పని భారానికి తగిన విదంగా సిబ్బంది లేరు. దీనికితోడు పాలనాపరమైన అదనపు బాధ్యతలు. ప్రతినెలా చేతి చమురు వదిలించుకోవటం మినహా మిగిలిందేమీ లేదు. ఎంత త్వరగా ఇక్కడ నుంచి వెళ్లిపోతే అంత బాగుంటుందనే ధోరణి అధికారుల్లో కనిపిస్తోంది.

స్థానిక బుర్రిపాలెం రోడ్డులో పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయం ఉంది. ఆ కార్యాలయం పరిధిలో గుడివాడ, కొలకలూరు, పెదరావూరు, అంగలకుదురు మొత్తం నాలుగు వెటర్నరీ డిస్పెన్సరీలున్నాయి. బుర్రిపాలెం, పినపాడు, కంచర్లపాలెం, నందివెలుగు, ఐతానగర్, సంగంజాగర్ల మూడి మొత్తం ఆరు వెటర్నరీ సబ్ సెంటర్లు ఉన్నాయి. కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌తో పాటు ఒక కాంపౌండర్, ఇద్దరు అటెండర్లు ఉన్నారు. కార్యాలయం పట్టణ శివారులో ఉంటుంది. శివారు ప్రాంతంలో పశుపోషకులు అధికమే. పట్టణ పరిధిలో పెంపుడు కుక్కలు కూడా ఎక్కువే. కార్యాలయం పరిధిలో దాదాపు 1700 నుంచి 2 వేల వరకూ గేదెలున్నాయి. పెంపుడు కుక్కల సంఖ్య లెక్కకు మించే ఉంది. దీంతో ఆసుపత్రికి ప్రతి రోజు గేదెలు, పంపుడు కుక్కల తాకిడి అధికమే.

ఆసుపత్రలో గెదెలకు వ్యాక్సినేషన్‌తో పాటు జ్వరం, డయేరియా, చనుబబ్బుల వంటి రుగ్మతలకు చికిత్స అందిస్తున్నారు. పశువుల్లో సంక్రమించే వివిధ రకాల వ్యాధుల చికిత్స నిమిత్తం గేదెలు, కుక్కలను వాటి యజమానులు ఆసుపత్రికి తీసుకువచ్చి, తీసుకువెళుతుంటారు. పెంపుడు కుక్కలకు యాంటి రేబిస్ వ్యాక్సిన్‌తో పాటు ఇతర ఆరోగ్య సమస్యలకు చికిత్స అందిస్తుంటారు. గేదెలు రోజుకు 20 నుంచి 30, కుక్కలు రోజుకు 30 నుంచి 40 వరకూ వస్తుంటాయి. గతంలో రోజు మొత్తం మీద 20 కేసులు వచ్చేవని, ఇప్పుడు కేసుల సంఖ్య పెరగటంతో సిబ్బంది చాలటం లేదని అధికారి చెబుతున్నారు. అధికారిగా ఉన్న ఎ.డికి పాలనా పరమైన వివిధ రకాల పనులు, క్షేత్రస్థాయిలో పర్యటనలు పెరగటంతో పని భారం పెరిగిందని ఆయన చెబుతున్నారు. ఆసుపత్రిలో కేసుల పెరుగుదలకు అనుగుణంగా మందుల సరఫరా పెరగలేదని, ఫలితంగా సొంత ఖర్చులతో పశువులకు మందులు కొనుగోలు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బుర్రిపాలెం రోడ్డులోని వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయం

పనిభారం తట్టుకోలేకపోతున్నాం

గతంలో ఆసుపత్రికి గేదెలు, కుక్కల తాకిడి తక్కువ ఉండేది. ప్రస్తుతం ఉన్న కాంపౌండర్, ఇద్దరు అటెండర్ల సాయంతో సేవలందిచేవాళ్లం. ఇప్పుడు పనిపెరిగి సిబ్బంది చాలటం లేదు. వెటర్నకీ బిఎస్సీ చదువుతున్న విద్యార్థులతో కాలం వెళ్లదీస్తున్నాం. కనీసం పురపాలక సంఘ కేంద్రంలో ఒక వెటర్నరీ అసిస్టెంట్‌ను అయినా కేటాయించాలి. గతంలో తక్కువ కేసులున్నపుడు ఏ మోతాదులో మందులు పంపిణీ చేశారో అదే మోతాదు ఇప్పటికి సరఫరా చేస్తున్నారు. కేసుల సంఖ్య పెరగటంతో మందులు చాలటం లేదు. ప్రతినెలా సొంతగా మందులకు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఆర్థిక భారం పెరిగిపోయింది. దీనికి తోడు పాలనాపరమైన అదనపు బాధ్యతలు అప్పగించారు. వీలైనంత త్వరగా తెనాలి నుంచి మరో ప్రాంతానికి వెళితే బాగుంటుందని భావిస్తున్నా.

డాక్టర్ ఆర్.నాగిరెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్, తెనాలి

గోవులను పరిశీలిస్తున్న మేయర్, కార్పొరేటర్లు

గోవుల కోసం రూ.50 లక్షలతో షెడ్డు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో వీధుల వెంట తిరిగే గోవులకు జిఎంసి ఆధ్వర్యంలో నిర్మిస్తున్న బందెల దొడ్డి నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు ఆదేశించారు. గోవుల పరిరక్షణలో భాగంగా, గోవులకు ప్రత్యేకంగా (నగర పాలక సంస్థ, గోవుల దొడ్డి) షెడ్డు నిర్మించుటకు నల్లపాడులోని వెంగళాయపాలెంలో గోసేవ రంక్షులతో కలిసి మేయర్ మనోహర్ నాయుడు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో వీధుల వెంట తిరిగే ఆవులు అధికంగా ఉన్నాయని, వాటి కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని, వాహనాలకు గోవులు అడ్డు వచ్చి ప్రమాదాలకు గురవటమే కాకుండా, రోడ్లపై తినకూడని పదార్థాలు తిని ఆనారోగ్యాల పాలవుతున్నాయని అన్నారు. ఆవులను పరిరక్షణ కోసం ప్రత్యేకంగా నగరంలో నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నల్లపాడులో వెంగళాయపాలెంలో సుమారు రూ.50 లక్షలతో షెడ్డు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిడిసిసి బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు, కార్పొరేటర్లు చల్లా రాజ్యలక్ష్మి, ఈచంపాటి వెంకటకృష్ణ, సాదు ఉమామహేశ్వరి రాజేష్, గుంటూరు ప్రొటెస్టింగ్ బర్డ్స్ అండ్ యానిమల్స్ అసోసియేషన్ సభ్యులు ప్రదీప్‌జైన్ పాల్గొన్నారు.

మానసిక అనారోగ్యం వల్లా గుండె జబ్బులు

ప్రజాశక్తి-గుంటూరు

మానసిక ప్రశాంతత లేమి కూడా కొన్ని సందర్భాల్లో గుండె జబ్బులకు కారణం అవుతుందని కార్డియాలజిస్ట్ డాక్టర్ బి.నాగరాజు అన్నారు. ఆదివారం అవగాహన ఆధ్వర్యంలో స్థానిక అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ఆరోగ్యసభలో డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ పెద్ద వయస్సులో వచ్చే గుండె జబ్బులు కొన్ని సందర్భాల్లో వారి మానసిక ఆనారోగ్యం వల్ల కూడా సంభవించే అవకాశం ఉందని, కావున మానసిక ఆరోగ్యం చాలా అవసరమని అన్నారు. ముఖ్యంగా గుండె జబ్బులకు షుగర్, రక్తపోటు, ధూమపానం, వంశపారంపర్యం, జన్యుపరమైన కారణాలుగా కనిస్తాయన్నారు. గుండె కొట్టుకునే వేగం తగ్గినా పెరిగినా, మన గుండె దగ్గర చర్మం కింద పేజ్ మేకర్స్ అమరుస్తారని, అది గుండె సాధారణ స్థితిలో కొట్టుకునేలా చేస్తుందని చెప్పారు. కోపం ఎక్కువగా ప్రదర్శించే వారందరికీ రక్తపోటు ఉందని, లావుగా ఉన్న వారికే కొలెస్ట్రాల్ సమస్య ఉందని భావించద్దన్నారు. నిర్మలంగా కనిపించే వారిలోనూ రక్తపోటు సమస్య ఉండవచ్చని, సన్నంగా ఉండే వారిలోనూ కొలెస్ట్రాల్ ఉండవన్నారు. షుగర్, రక్తపోటు వల్ల కూడా గుండె జబ్బులు వస్తాయన్నారు. ఆహారంలో పీచుపదార్థం ఎక్కువగా ఉండేలా చూసుకోవాలని, తద్వారా రక్తంలో చక్కెర శాతాన్ని అదుపులో ఉంచుకోవచ్చని వివరించారు. గుండెకు సంబంధించి రక్తనాళాలలో పూడికలు శాతం ఎక్కువగా ఉంటే స్టంట్, బైపాస్ సర్జరీ చేస్తారని, తక్కువగా ఉంటే మందులతో చికిత్స చేయెచ్చన్నారు. 40 ఏళ్ల తర్వాత ప్రతి ఒక్కరూ స్క్రీనింగ్ టెస్ట్ చేయించుకోవాలన్నారు. అనంతరం అవగాహన సభ్యులు డాక్టర్ నాగరాజును సన్మానించారు. కార్యమ్రకంలో అవగాహన సీనియర్ సభ్యులు ఇ.చంద్రయ్య, విశ్రాంత హెచ్ఎం టి.నారపరెడ్డి, వేమన ట్రస్ట్ అధ్యక్షులు సిహెచ్.అంజిరెడ్డి పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ పాపినేని శివశంకర్, తదితరులు

సాహిత్య విదూషిమణి 'భవానీ దేవి'

ప్రజాశక్తి-గుంటూరు

విద్యార్థి దశ నుండే కుటుంబ, ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ ఐదు దశాబ్దాలుగా రచయిత్రిగా, కథకురాలిగా, మానవీయ కోణంలో అక్షర యజ్ఞం చేస్తున్న సాహితీ విదూషిమణి డాక్టర్ చిల్లర భవానీదేవి అని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పురస్కార గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ అన్నారు. ఆదివారం జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో స్థానిక బృందావన్ గార్డెన్స్ వెంకటేశ్వర స్వామి దేవస్థానం, అన్నమయ్య గ్రంథాలయంలో చిల్లర భవానీదేవి సాహితీ స్వర్ణోత్సవ ప్రచురణలు 'చివరి వలస' కథా సంపుటి, 'మరోచరిత' నవల ఆవిష్కరణల సభ నిర్వహించారు. డాక్టర్ శివశంకర్ మాట్లాడుతూ భవానీదేవి రచనల్లో వైవిధ్యంతో కూడిన మేధో వికాసం ప్రస్ఫుటమవుతుందన్నారు. పుస్తకాలను జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు సోమేపల్లి వెంకటసుబ్బయ్య ఆవిష్కరించారు. సభకు సరస్వత కళానిధి డాక్టర్ వెలుఓలు నాగరాజ్యలక్ష్మి అధ్యక్షత వహించగా కోటంరాజు సత్యనారాయణ శర్మ దంపతుల స్మారక సాహితీ పురస్కారాన్ని వారణాసి సూర్య కుమారికి అందజేశారు. ప్రముఖ రచయిత్రులు గోటేటి లలితా శేఖర్ 'చివరివలస' పుస్తకాన్ని, కుందుర్తి పద్మజ 'మరోచరిత' పుస్తకాన్ని పరిచయం చేశారు. కార్యక్రమంలో జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్ఎం సుభాని, కోశాధికారి నానా, అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షులు పి.లక్ష్మీనారాయణ, అమరావతి సాహితీ మిత్రులు అధ్యక్షులు రావి రంగారావు పాల్గొన్నారు.

సిరిపురంలో రైతులకు అవగాహన

ప్రజాశక్తి - మేడికొండూరు

మండలంలోని సిరిపురంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై ఆదివారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.రాజకుమారి మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో స్వల్పకాలంలోనే ఎక్కువ ఆదాయాన్ని పొందొచ్చన్నారు. భూములను సారవంతమూ చేసుకోవచ్చన్నారు. ఎటిఎం మోడల్ ద్వారా ప్రధాన పంటకు తోడు అంతర్ పంటలుగా ముల్లంగి, బీట్రూట్, క్యారెట్, బెండ, గోరుచిక్కుడు, చెట్టు చిక్కుడు, టమాట, వంగ, మిరప, స్వీట్ కార్న్, తోటకూర, చుక్కకూర, పాలకూర, మెంతికూర, గోంగూర, కొత్తిమీర మొదలగు ఆకుకూరలను వేయాలని చెప్పారు. రక్షక పంటలుగా జొన్న, సజ్జ, ఎర పంటలుగా ఆముదం, బంతి, సన్‌ఫ్లవర్, బెడ్లకు నలు దిక్కులలో తీగజాతి కాయగూరలు సొర, బీర, కాకర, పొట్ల, నేతి బీర వేసుకొని రైతులు నిత్యం ఆదాయం పొందొచ్చని వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది ఐ.వెంకటేశ్వర్లు, భార్గవ్, రామకృష్ణ, వాణి, మేరీ, శ్రీలక్ష్మి రైతులు పరమేశ్వరరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు కాకుమానులో ఆరోగ్య సురక్ష శిబిరం

ప్రజాశక్తి - కాకుమాను

మండల కేంద్రమైన కాకుమానులోని జెడ్‌పి పాఠశాలలో సోమవారం ఉదయం 10 గంటలకు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహిస్తామని ఎంపిడిఒ పి.రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని, నిపుణులైన వైద్యులు పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు.

వాసవి సేవా సమితి ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - తెనాలి

పట్టణానికి చెందిన వాసవి సేవా సమితి, పెదకాకాని శంకర నేత్రాలయం, జిల్లా అంధత్వ నివారణ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం వాసవి కన్యకా పరమేశ్వరి వైశ్య విద్యానిధి ఆవరణలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. పరీక్షలు చేసి మందులు పంపిణీ చేవారు. శస్త్ర చికిత్స అవసరమైన వారిని దశలవారీగా శంకర నేత్రాలయకు తరలించనున్నట్లు వాసవి సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు వి.వెంకట శేషగిరిరావు, పి.సుబ్బారావు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ పి.వెంకట్రావు, టి.శివలింగేశ్వరరావు, టి.సుధాకర్, జి.సాంబశివరావు, ఎస్.రమేష్ పాల్గొన్నారు.

వాక్‌థాన్‌లో పాల్గొన్న వైద్యులు, విద్యార్థులు

పక్షవాతంపై అవగాహనకు వాక్‌థాన్

ప్రజాశక్తి-గుంటూరు

ప్రపంచ పక్షవాత దినోత్సవాన్ని పురస్కరించుకొని పక్షవాతంపై అవగాహన కల్పించేందుకు ఆదివారం న్యూరోసైంటిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరులోని ప్రముఖ న్యూరాలజిస్టులు మెగా వాక్‌థాన్ నిర్వహించారు. స్థానిక ఎన్‌టిఆర్ స్టేడియం నుండి గుజ్జనగుండ్ల వాకింగ్ ట్రాక్ వరకూ నిర్వహించిన ఈ ర్యాలీని ఆంధ్రప్రదేశ్ న్యూరో సైంటిస్ట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ విజయ పచ్చజెండా ఊపి ప్రారంభించారు. పక్షవాత లక్షణాలు, నివారణ, కారణాలు గురించి ప్లకార్డులు, బ్యానర్లు, పాంప్లెట్లతో అవగాహన కల్పించారు. లలితా కాలేజి ఆఫ్ నర్సింగ్ విద్యార్థులు పెరాలిసిస్ అంశంపై ప్రదర్శించిన స్కిట్ అందర్నీ ఆకట్టుకుంది. గుంటూరు న్యూరో సైంటిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ వి.రామతారక్ నాథ్ మాట్లాడుతూ స్ట్రోక్ నివారణకు జీవనశైలిలో మార్పుల ప్రాధాన్యతను వివరించారు. కోశాధికారి డాక్టర్ సిహెచ్.శివరామకృష్ణ బ్రెయిన్ హెల్తీ డైట్ గురించి తెలిపారు. క్రమం తప్పకుండా వ్యాయామాల వల్ల కలిగే ప్రయోజనాలు జిజిహెచ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అరుణకుమారి వివరించారు. కార్యక్రమంలో న్యూరాలజిస్టులు డాక్టర్ జి.చందన, డాక్టర్ ఎస్.కల్యాణచక్రవర్తి, డాక్టర్ పి.రాజేంద్రకుమార్, డాక్టర్ ఎం.భార్గవి, డాక్టర్ పిడికిటి బాలకృష్ణ పాల్గొన్నారు.

ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్‌కు జాతీయ స్థాయి అవార్డు

ప్రజాశక్తి - గుంటూరు సిటి

వాయిస్ ఆఫ్ హెల్త్ కేర్ జాతీయ స్థాయి సంస్థ 'వరల్డ్ స్ట్రోక్ డే-2023' ను పురస్కరించుకుని గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఈ నెల 27 జరిగిన నేషనల్ స్ట్రోక్ కాన్‌క్లేవ్ 2023లో బెస్ట్ స్ట్రోక్ అవేర్నెస్ అడ్వకేట్ హాస్పిటల్ ఆఫ్ ది ఇయర్ జాతీయ అవార్డును ఆస్టర్ రమేష్ హాస్పిటల్‌కు అందించినట్లు ఆస్పత్రి చీఫ్ న్యూరాలజిస్ట్ రిటైర్డ్ మేజర్ జనరల్ డాక్టర్ కుమారవేలు తెలిపారు. ఈ మేరకు వివరాలను ఆదివారం గుంటూరులోని ఆస్టర్ రమేష్ హాస్పిటల్లో విలేకర్లకు వివరించారు. డాక్టర్ కుమారవేలు మాట్లాడుతూ గుజరాత్ రాష్ట్ర ఆరోగ్య, సంక్షేమ శాఖ మంత్రి ఋషికేష్ గణేష్ భాయ్ పటేల్ నుండి అవార్డ్‌ను అందుకున్నట్లు తెలిపారు. ప్రపంచ స్థాయి నాణ్యతా ప్రమాణాల సంస్థ జాయింట్ కమిషన్ ఇంటర్నేషనల్ (జెసిఐ) అత్యున్నతమైన వైద్య సేవలు అందించే హాస్పిటల్స్‌కు ఇచ్చే గుర్తింపును రెండోసారి కూడా ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్‌కు ఇచ్చిందన్నారు. ప్రతిష్టాకరమైన క్వాలిటీ అండ్ అక్రిడిటేషన్ ఇనిస్టిట్యూట్స్ దేశం మొత్తం మీద స్ట్రోక్ పేషెంట్లకు నాణ్యమైన వైద్య సేవలందించే ఆరు స్ట్రోక్ సెంటర్లకు గుర్తింపునివ్వగా ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యేకమైన పూర్తిస్థాయి స్ట్రోక్ సెంటర్‌ను నిర్వహిస్తున్న తమ హాస్పిటల్‌కు అక్రిడిటేషన్ వచ్చిందన్నారు.

బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిన మొదటి గంటలో వ్యాధి నిర్ధారణ, వైద్య చికిత్స ఎంతో అవసరమని, తద్వారా ప్రాణహాని నుంచి దీర్ఘకాలిక వైకల్యం నుంచి రోగిని కాపాడుకోగలమని చెప్పారు. స్ట్రోక్ కారకాలుగా పరిగణించే రక్తపోటు, షుగర్‌ను అదుపులో ఉంచుకోవాల్సిన అవసరాన్ని ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ సామాజిక బాధ్యతగా గుర్తించి పక్షవాతం వల్ల సంభవించే దుష్ఫలితాల పట్ల ప్రజల్లో నిత్యం అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. ఈ కృషికే జాతీయస్థాయిలో అవార్డు వచ్చినట్లు చెప్పారు. ప్రతి సంవత్సరం అక్టోబర్ 29న ప్రపంచ వ్యాప్తంగా 'వరల్డ్ స్ట్రోక్ డే' సందర్భంగా ఈ ఏడాది'టుగెదర్ వి ఆర్ గ్రేటర్ దేన్ స్ట్రోక్' నినాదంతో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని, ఈ వ్యాధిలో సమయం చాలా విలువైందని, వ్యాధి లక్షణాలు కనిపించగానే రోగులు, కుటుంబ సభ్యులు అప్రమత్తమై సమీప స్ట్రోక్ సెంటర్‌కు తీసుకెళ్లాలని వివరించారు.

హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పోతినేని రమేష్‌బాబు మాట్లాడుతూ డాక్టర్ కుమార్‌వేలు ఆధ్వర్యంలో ముగ్గురు న్యూరాలజిస్టులు నాణ్యమైన వైద్య సేవలను అందిస్తున్నారని, స్ట్రోక్ వచ్చిన వెంటనే వ్యాధి నిర్ధారణలో ఉపయోగపడే అధునాతన వైద్య పరికరాలైన ట్రాన్స్ క్రేనియల్ డాప్లర్,128 స్లైస్, సి.టి స్కానర్, 3 టెస్లా ఎం.ఆర్.ఐ, ప్రత్యేకమైన స్ట్రోక్ యూనిట్‌ను అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. గుంటూరు, ఒంగోలు, విజయవాడలో స్ట్రోక్‌తో హాస్పిటల్ నందు చేరిన రోగులను నిరంతరం పర్యవేక్షించడానికి 'క్లౌడ్ డాక్స్ రమేష్' అనే టెలి ఐ.సి.యు అధునాతన టెక్నాలజీని విజయవాడలో సెంట్రల్ కమాండ్ స్టేషన్‌ను ముగ్గురు క్రిటికల్ కేర్ వైద్య నిపుణులతో ఏర్పాటు చేశామని, రోగులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో న్యూరాలజిస్టులు డాక్టర్ ఎస్.బాల కృష్ణ, డాక్టర్ పి.హరిణి, డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మమత రాయపాటి, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ పావులూరి శ్రీనివాసరావు, బిజినెస్ డెవలప్మెంట్ హెడ్ డాక్టర్ వై.కార్తీక్ చౌదరి పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన దుండగుల్ని శిక్షించాలి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల నిరసనలు

గుంటూరు నిరసనలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి బి.లక్ష్మణరావు

ప్రజాశక్తి-గుంటూరు

హార్న్ కొట్టారనే నెపంతో వెంబడించి కావలి ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని సిఐటియు, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఆదివారమూ నిరసనలు కొనసాగించారు. ఇందులో భాగంగా గుంటూరు నగరంలోని పాతగుంటూరు సిఐటియు జిల్లా కార్యాలయం నుండి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. సిఐటియు నగర తూర్పు ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి బి.లక్ష్మణరావు మాట్లాడుతూ ఆర్టీసి డ్రైవర్‌పై జరిగిన దాడిలో నిందితుల్ని శిక్షించే విషయంలో ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్య బాధ్యతగా వ్యవహరించాలని, ఉద్యోగులకు మనోధైర్యం కల్పించాలని కోరారు. 14 మంది దాడిలో పాల్గొంటే కేవలం ఆరుగురినే అరెస్టు చేసి చేతులు దులుపుకునే ప్రయత్నం జరుగుతోందన్నారు. అందరికీ కఠినమైన శిక్షలు పడేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులపై రకరకాల ఆంక్షల పేరుతో ఉన్న నిబంధన కారణంగానే సమయానికి చేరుకోవాలని ఆత్రుతతో అడ్డన్న వారిని తప్పుకోవాలని హార్న్ మోగించారే తప్ప దీనిలో డ్రైవర్ తప్పేమీ లేదన్నారు. అధికార పార్టీ కౌన్సిలగా ఉన్న వ్యక్తి దాడిలో భాగస్వామిగా ఉన్నాడని, ఎంతటి వారికైనా శిక్షలు పడటం ద్వారానే ఉద్యోగులకు నమ్మకం పెరుగుతుందని అన్నారు. నిరసనలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ, కార్యదర్శులు ఎన్.శివాజీ, రమేష్‌బాబు, ఎవిఎన్ కుమారి, రాధా, శ్రీనివాసరావు, ఆది నికల్సన్, రాంబాబు, ఎస్.ఎం.వలి, ఎం.రవి, వేణు, అనురాధ, బోషమ్మ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలిరూరల్

స్థానిక ఆర్‌టిసి బస్టాండ్‌లో గేట్ మీటింగ్ నిర్వహించారు. అనంతరం ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఇ.విజయకుమార్, రీజినల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఐ.రాజేష్ ఖన్నా మాట్లాడారు. దాడికి కారకులైన యువకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దోషులను శిక్షించేంత వరకూ నిరసన కొనసాగిస్తామని హెచ్చరించారు. నిరసనలో కె.బాబు, ఎన్.సుధాకరరావు, పి.వీరయ్యబాబు, ఎస్.రవీంద్రారెడ్డి, వి.జోషిబాబు, డిడి శ్రీనివాసులు, జి.పోలేరమ్మ, ప్రసన్నజ్యోతి శివపార్వతి, రమాజయశ్రీ, భూలక్ష్మి పాల్గొన్నారు.

సత్తెనపల్లిలో..

వినుకొండలో

తెనాలిలో..

ప్రజాశక్తి - వినుకొండ

ఎంప్లాయిస్ యూనియన్ పిలుపుమేరకుకు డిపో ఉద్యోగులు ఉదయం 5 గంటల నుండి నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియజేస్తూ విధులకు హాజరయ్యారు. అనంతరం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఎంప్లాయిస్ యూనియన్ పల్నాడు జిల్లా అధ్యక్షులు షేక్ ఖాజా, డిపో సెక్రటరీ డిపో నాయకులు మాట్లాడారు. బస్టాండ్, బస్సుల్లోని ఉద్యోగులపై దాడి చేస్తే ఐపిసి సెక్షన్ 186, 189, 353 ప్రకారం శిక్ష పడుతుందని బోర్డుల ద్వారా తెలపాలని, ఉద్యోగులకు ప్రాణ రక్షణ కల్పించాలని కోరారు. నిరసనలో కె.హరిబాబు, కె.రమేష్‌బాబు, టిఎస్ రావు, ఎం.బాబురావు, పి.సాంబశివరావు, జి.శ్రీనివాసరావు, టి.రవిబాబు, మధుబాబు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

స్థానిక బస్టాండ్ వద్ద ఆర్టీసీ కార్మికులు నిరసన తెలిపారు. నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు భాస్కర్, సాహెబ్, జవహర్, ఎన్ఎంయు నాయకులు నాగేశ్వరరావు, సుధాకర్, రమణారెడ్డి, యలమంద పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

ఆర్టీసీ డిపో వద్ద ఆర్టీసీ ఉద్యోగ సంఘాలు, సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సిఐటియు మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు మద్దతు తెలిపి మాట్లాడారు. ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉండి సేవలందిస్తున్న సిబ్బందిపై నిత్యం దాడులు జరుగుతూనే ఉన్నా కొన్ని మాత్రమే వెలుగులోకి వస్తున్నాయని ఆవేదన వెలిబుచ్చారు. ఆర్టీసీ సంస్థను కాపాడుకోవాలని, ఉద్యోగులు, సిబ్బందితో ప్రజలు సోదర భావంతో మెలగాలని కోరారు. సిఐటియు నాయకులు బి.వెంకటేశ్వర్లు, సంపత్ వెంకటకృష్ణ, బి.నాగేశ్వరరావు, జి.కోటేశ్వరరావు, ఎం.కాటంరాజు, ఎఐటియుసి నాయకులు జె.కృష్ణ నాయక్, సుజాత, కొక్కెర వెంకటేశ్వర్లు, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు బి.శ్రీనివాసరావు, బ్రహ్మారావు, జి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆర్‌విఆర్‌లో ముగిసిన ఎన్‌సిసి శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు

బాలురకు సమానంగా బాలికలు కూడా దేశ సేవలో పాల్గొనేలా ఎన్‌సిసి శిక్షణ పొందటం వారి దేశభక్తికి నిదర్శమని కల్నల్ నీజర్ కుమార్ అన్నారు. చౌడవరంలోని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజీలో 10-ఆంధ్ర గరల్స్ బెటాలియన్ ఎన్‌సిసి ఆధ్వర్యంలో పది రోజులుగా గుంటూరు జోన్ పరిధిలో ఎన్‌సిసి క్యాడెట్లకు జరుగుతున్న ఎటిసి-5 క్యాంపు శిక్షణ ఆదివారం ముగిసింది. శిక్షణలో 706 మంది కేడెట్లకు ఫైరింగ్, డ్రిల్, టగ్ ఆఫ్ వార్, వాలీబాల్, అథ్లెటిక్స్, రన్నింగ్, క్రీడా, సాంస్కృతిక విభాగాల్లో శిక్షణిచ్చినట్లు క్యాంపు కమాండెంట్ నీరజ్‌కుమార్ పేర్కొన్నారు. శిక్షణలో ఉత్తమ ప్రతిభ చూపిన క్యాడెట్లకు జనవరి 26న ఢిల్లీలో జరిగే రిపబ్లిక్‌డే పరెడ్‌లో పాల్గొనే అవకాశం లభించిందని అన్నారు. వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన క్యాడెట్లకు మెడల్స్, ప్రోత్సాహక నగదు బహుమతులు, సర్టిఫికెట్లు అందచేశారు. శిక్షణకు సహకారం అందించిన ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి యాజమాన్యానికి కల్నల్ నీరజ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. డిప్యూటీ క్యాంపు కమాండెంట్ కల్నల్ రెజిత్ ముకుందన్, క్యాంపె ఎస్ఎం సుబేదార్ పాణ్యం రఫీ, జిసిఐ జెస్సీ జోరాల్డ్ పాల్గొన్నారు.

శిక్షణలో ప్రతిభ చూపిన కేడెట్లతో ఎన్‌సిసి అధికారులు